

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు



సంపుటి - 1 **డిజిటల్ మాస పత్రిక** సంచిక - 4

**శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక**



**సెప్టెంబర్ 2026**

**శ్రీ గురుధాం ధర్మక్షేత్రం**

**శ్రీ శివానందగురు ఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్ - బలుసుపాడు**

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు

సంపుటి-1 **డిజిటల్ మాసపత్రిక - సెప్టెంబర్ 2026** సంచిక - 4

శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక

ప్రకాశకులు : శ్రీ శివానందగురుఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు, జగ్గయ్యపేట (మం), ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు : శ్రీ గెంటేల ఆనంద శంకర్, శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు

**ఓంనమో - భగవతే - శ్రీశివానందాయ**
**శ్రీహనుమ జయహనుమ శివానంద హనుమ**

## ఈ సంచికలో...


| | |
|---|---|
| గురు...దైవ...దేశభక్తి ప్రబోధకం! శ్రీగురుధామం!! | 3 |
| సందేహ నివారణ | 4 |
| అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు | 5 |
| అంతశ్చేతనలోని సూక్ష్మ ఆలోచనే మూలమాయ | 6 |
| శ్రీకృష్ణ పరమాత్మ 'నేను'ను పోగొడతారు!! | 8 |
| శ్రీ గురుధాం ధర్మక్షేత్రంలో వినాయక చవితి పర్వదినం | 14 |
| సత్సంబంధాల కోసమే గణపతి పూజ | 16 |
| అందరి కోసం ఉన్న దేవుడు విఘ్నం కోసం ప్రార్థన! | 20 |
| మనిషిని మనిషిగా చూడటం చేతనైనప్పుడే జ్ఞానానికి పునాది పడుతుంది. | 24 |
| మనస్సు ప్రతిధ్వనించకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే సత్యాన్ని అందుకోగలుగుతుంది. | 28 |
| జన్మజన్మల కర్మలను నశింపజేసే ఓంకార సాధన | 31 |
| శరణాగతి అంటే! | 34 |
| విచారణ అంటే విభజన లేనిదాన్ని తెలుసుకోవడం | 36 |
| దైవభక్తి... దేశభక్తి...సనాతన ధర్మానికి రెండు కళ్లు | 40 |
| Ask Him for an Obstacle : Thoughts for Ganesh Chaturthi | 46 |


**కళ్లు మూస్తే దైవాన్ని స్మరించు - కళ్ళు తెరిస్తే దేశాన్ని సేవించు**

FOR PRIVATE CIRCULATION ONLY

# గురు...దైవ...దేశభక్తి ప్రబోధకం!
# శ్రీగురుధామం!!

**శి**వశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల సత్సంకల్పబలంగా, సద్గురు శ్రీశివానంద మూర్తి భగవానుల అనుగ్రహ ఫలంగా బలుసుపాడులో రూపుదిద్దుకున్న శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం గురుభక్తి, దైవభక్తి, దేశభక్తి ప్రబోధాల సమ్మేళనంగా సమాజాన్ని ముందుకు నడిపిస్తున్నది. భారతీయ సనాతన ధర్మ విశిష్టతలో ఉన్న చతుర్విధ పురుషార్థకసాధకమైన జీవితాన్ని ప్రబోధిస్తూ అందులోని గురు, దైవ, దేశభక్తి యొక్క ఆవశ్యకతను, విశిష్టతను అనుక్షణం గుర్తుచేస్తున్నది. వసుధైక కుటుంబానికి చిహ్నంగా నిలిచే ఇక్కడి గురుకుటుంబం శివశ్రీ రమణగురుదంపతుల ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో అనుదినం అనుక్షణం చిత్తశుద్ధితో ఆచరణాత్మకమైన ఈ త్రినేత్రాత్మకమైన భక్తి పరాయణతను చాటుకుంటున్నది. “ఈశ్వరుడిని చూపించే గురువే గురువు. గురువు చూపించే ఈశ్వరుడే ఈశ్వరుడు”. అన్న సద్గురుదేవుల వాక్యాల్లోని సనాతన ధర్మ విశిష్టత ఈ క్షేత్రంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. గురు ఆరాధన అంటే వ్యక్తి ఆరాధన కాదని, గురుతత్వాన్ని, అందులోని ఈశ్వరతత్వాన్ని ఆరాధించడమే నిజమైన గురుభక్తి అవుతుందన్న సత్యాన్ని ఆచరణాత్మకం చేస్తున్న ఈ క్షేత్రం ద్వారా అజరామరమైన మన భారతీయ తత్వారాధానే జరుగుతున్నది. దేశభక్తి అంటే వ్యక్తిత్వ నిర్మాణం మొదలుకొని కుటుంబ సంస్కరణ, విద్యావ్యవస్థ, సామాజిక సామరస్యత, జాతి నిర్మాణాల విషయంలో పౌరబాధ్యతలను గుర్తుచేసే శ్రీగురుధామం భక్తి పరమార్థానికి సమగ్రమైన స్వరూపంగా నిలుస్తున్నది. ఇక్కడికి వచ్చే గ్రామీణ, పట్టణ, నగరవాసులు ఈ గురు, దైవ, దేశ భక్తి పరాయణతను పుణికిపుచ్చుకునే విధంగా సద్గురుదేవుల ఆశయాలను స్మరిస్తూ, శివశ్రీ రమణ గురుదేవుల బోధలను ఆచరిస్తూ గురుకుటుంబం ముందుకు సాగుతున్నది. స్వీయ ఉద్ధరణ, జాతి సంరక్షణలకోసమే దైవారాధన అన్న సద్గురుదేవుల బోధనల స్వీకరణలోనే గురు, దైవ, దేశ భక్తి మిళితమై కనిపిస్తుంది.

# మారింది రూపమా? స్వరూపమా? పరిశీలిస్తే తెలుస్తుంది!

**ప్రశ్న : మనసుగా ఉన్న ఆత్మ చైతన్యమేనని ఎలా తెలుసుకోవాలి?**

**శివశ్రీ రమణ గురుదేవులు :** ఒక అమాయక వ్యక్తి స్వర్ణకారుడికి బంగారాన్ని ఇచ్చి నగను తయారు చేయమన్నాడు. అతను ఆ నగను తీసుకునేందుకు తిరిగి స్వర్ణకారుడి వద్దకు వెళ్లినప్పుడు అతనిచ్చిన ఆభరణం చూసి ఇదేంటి... నా బంగారం ఎక్కడ? అని ప్రశ్నించాడు. 'నీ బంగారాన్నే నగగా మార్చాను' అని ఆ స్వర్ణకారుడు చెప్పినా.. 'లేదు లేదు... నా బంగారం నాకు కావాలి. నువ్వు నాణ్యమైన బంగారం తోనే ఈ నగచేశావని గ్యారెంటీ ఏమిటి?' అని పట్టుబట్టాడు. ఇలా వారి మధ్య వివాదం జరుగుతుండగా అక్కడికి వచ్చిన ఒక తెలివైన వ్యక్తి బంగారాన్ని పరీక్షించే గీటురాయిపై బంగారం ముక్కని, స్వర్ణకారుడు చేసిన నగను రుద్ది వాటి వన్నెల్లో తేడా లేదని చూపించాడు. అప్పుడు కానీ నగలో ఉన్నది నాణ్యమైన బంగారమేనని నిర్ధారణ చేసుకున్న ఆ వ్యక్తి నిశ్చింతగా ఆ నగ తీసుకొని వెళ్లాడు. అలానే జ్ఞానులు అనాదిగా 'నువ్వు ఆత్మస్వరూపానివే' అని చెప్తున్నా నగలాగా కనిపించే మన మనసు గుణాలను చూసి మనం ఆత్మస్వరూపులం అని నమ్మలేకపోతున్నాము. ఈ సందిగ్ధాన్ని, సంశయాన్ని తీర్చడానికే గురువు వచ్చి నీకు, దైవానికి ఉన్న సారూప్యతను చూపించి మనకు ఆ నిశ్చింతను కలగజేస్తారు. బంగారమే నగగా మారిందని ఎలా అయితే పరిశీలనలో రూఢి అయిందో... మన మనసు కూడా ఆత్మచైతన్యం యొక్క మరో వ్యక్తీకరణే అని విచారణలో తేటతెల్లం అవుతుంది. మనకు ఆలోచనలతో, అలజడితో, ఆందోళనలతో ఉన్న మనసు రూపం ఎలా తెలుసో శాంతిగా, ఆనందంగా ఉన్న మనసు స్వరూపం కూడా తెలుసు. జీవనంలో భాగంగా దేహభావనతో కూడిన ఆలోచనలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలతో మనసు మారినట్లు క(అ)నిపించినా అవి ఏవీ శాశ్వతంగా మనసులో నిలిచి ఉండటం లేదు. వచ్చిపోతున్నాయి అంతే. భక్తిచేత పవిత్రమైన మనసు దైవం వైపు తిరిగితే... గురువు నీకు అద్దంలా నిలిచి నీ హృదయంలోనే ఉన్న పరమాత్మను చూపుతారు. ఆత్మచైతన్యం మరురూపంలో మనసుగా పిలవడిందే కానీ స్వరూపాన్ని మార్చుకోలేదన్న పరమార్థాన్ని నీ అవగాహనలోకి తెస్తారు.

# అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు

## శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల హనుమత్ జ్ఞాన పుష్పాలు

❖ కోరిక ఉంటే ఉన్నది తెలియదు.
ఉన్నది ఉన్నట్లు చూస్తే కోరిక మిగలదు.

❖ భౌతిక జీవనంలో అనుభవం పొందే వరకు ప్రయత్నం జరగాలి!
ఆధ్యాత్మిక ప్రయాణంలో అనుభవాలు పోయేవరకు సాధన సాగాలి!

❖ ఆద్యంతాలు లేనిదే అద్వైతం!
ఆలోచనలకు అదే ఆధారం!
అర్థమైతే నిరంతర ధ్యానం!
అన్ని జీవులలో అది సహజం!

❖ కల్మషం పోయిన మనసుకు.
నిష్కల్మషమైన ఆత్మ దర్శనమిస్తుంది.

❖ ప్రతిస్పందనలు లేనిదే మన ఎరుక! పవిత్ర స్పందనే దానికెరుక!

❖ మాయను మనం తెలుసుకోవాలి! జ్ఞానం అదే తెలియబడుతుంది!

❖ మనసులో వికారం లేని స్థితి ధ్యానం!
వ్యక్తం అవ్యక్తపోవడమే వినయం!
స్వస్థితి వైపు తిరగడమే తురీయం!!

❖ వాసనలతో కూడిన మనసు వెంపర్లాడుతుంది!
వెంపర్లాట లేని మనసు నిత్యోపాసనగా ఉంటుంది!!

❖ ధ్యానానికి అవరోధం ఆలోచనలు కాదు! ఆలోచనలను ప్రేరేపించే గుణం!!

❖ జ్ఞానం ఒకరు అందించే వస్తువు కాదు!
ఉన్నదాన్ని మనమే గుర్తించే వాస్తవం!!

# అంతశ్చేతనలోని సూక్ష్మ ఆలోచనే మూలమాయ

మనం ఉనికి (ఆత్మ), ఉపాధి (దేహం) ఉన్నది (ప్రపంచం)ల సమ్మేళనంగా ఉన్నాం. ఉనికి ఉపాధితో కలిసి మనసుగా ఏర్పడిన తరువాత వచ్చే ఆలోచనలు దైహిక మానసిక ఆంతరంగిక ఆలోచనలుగా మూడు స్థాయిలో ఉంటాయి. విచారణ ద్వారా కలిగే అవగాహన మనసులోని ఈ మూడు స్థాయిల ఆలోచనలను తేట తెల్లం చేసి సహజ ధ్యానాన్ని, ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఉనికి ఉపాధితో కలిసి మనసుగా ఏర్పడి తాను కావాలనుకున్నది పొందే ప్రయత్నమే ఆలోచనగా ఉంటుంది. జీవనం కోసం అవసరమైన వాటికి చేసే ప్రయత్నాలు భౌతిక ఆలోచన లుగా ఉంటాయి. మన నుండి మనం మానసికంగా కోరుకునే అనుభూతి అనుభవాల కోసం చేసే ప్రయత్నం మానసిక ఆలోచనలుగా ఉంటాయి. ఆధ్యాత్మిక జీవనంలో చేసే ధ్యానం యోగం విచారణ వంటి సాధనల వల్ల మనసుకు నిశిత దృష్టి ఏర్పడి మనసు యొక్క స్వరూపాన్ని అంటే ఆలోచనల యొక్క సమగ్ర స్వరూపాన్ని మనకు అవగాహనలోకి తెస్తుంది. ఇందులో భాగంగానే తొలిగా భౌతికంగా జీవనం కోసం చేసేవన్నీ దైహికమైన ఆలోచనలే అన్న పొరను అది తెలుసుకుంటుంది. సాధనలో అవగాహన పెరిగే కొద్దీ తన నుండి తాను కోరుకునే ధ్యానం జపం పూజ యోగ స్థితులు కూడా సూక్ష్మమైన ఆలోచనలో బాగాలేనని అవగతం చేసుకుంటుంది. ఈ స్థాయిలో జ్ఞానులు బోధించిన ఎరుకకు మనసుకు ఉన్న వ్యత్యాసం స్పష్టంగా అవగతం అవుతుంది. కానీ ఆ స్థాయిలో కూడా నేనెవరో తెలుసుకోవాలి, తాను ఎరుకగా ఉండాలి, ఎరుకను తెలుసుకోవాలి, ఎరుకగా మిగిలి పోవాలి అని ఆకాంక్షించే ఒక ఆంతరంగిక ఆలోచన మిగిలే ఉంటుంది. గురువు అనుగ్రహంతో కలిగే అవగాహనలో నిశిత దృష్టితో ఉన్న మనసు.... ఈ చివరి ఆలోచనను మూల మాయ అని అర్థం చేసుకుంటుంది. మనసు యొక్క

ఈ సూక్ష్మ ఆకాంక్షను తెలుసుకున్న ఎరుక సహజ ధ్యానంగా మిగిలిపోతుంది. సాధనను సంపూర్ణం చేసే ఈ అంతిమ అవగాహనలో మనసు యొక్క పుట్టుక మొదలు ఆలోచనల పరంపర సంపూర్ణంగా తెలుస్తుంది. అప్పుడు జీవితం అంతా విస్తరించిన నేను అన్న అహంభావం నేనున్నాను అన్న తొలి భాగంగా ఎలా మూల మాయగా ఉందో ఎరుకకు అవగతం అవుతుంది. నిద్రలో ఈ నేను తెలియకుండా పోతుందని సాధన ద్వారా తెలిసిపోతుందని "తెలిసి"...పోతుందని.... అవగాహన ఏర్పడుతుంది. అదే జ్ఞానుల సహజ ధ్యానస్థితి.

## సద్గురు మూర్తికి మాసాంత అభిషేకాలు



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల వారికి ప్రతి మాసాంతములో నిర్వహించే రుద్రాభిషేకంలో భాగంగా స్వామిని అభిషేకిస్తున్న శివశ్రీ గెంటేల వెంకటరమణ గురు దంపతులు.

# శ్రీకృష్ణ పరమాత్మ 'నేను'ను పోగొడతారు!!

(సద్గురుదేవుల సనాతన చారిటబుల్ ట్రస్ట్ వారి కృష్ణాష్టమి పురస్కారం - 2016
గ్రహీతగా శివశ్రీ రమణ గురుదేవుల సందేశం)

నేడు కృష్ణాష్టమి కాబట్టి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో ముఖ్యంగా 'విశ్వరూప సందర్శన యోగం' అనే అధ్యాయాన్ని గుర్తుచేసుకుందాం. పరమాత్మ అప్పటివరకు అర్జునుడికి భక్తి యోగం, కర్మయోగం, జ్ఞానయోగం ఇవన్నీ చెప్పినప్పటికీ, అక్కడ ఒక ముఖ్యమైన ఘట్టాన్ని అర్జునుడికి ప్రసాదించాడు. "ఓ అర్జునా! నా విశ్వరూపాన్ని నీవు చూడాలంటే నీకు దివ్యదృష్టిని ప్రసాదిస్తున్నాను, ఈ దివ్యదృష్టితో నా విశ్వరూపాన్ని చూడు" అని అన్నాడు. ఆ దివ్యదృష్టితో అర్జునుడు ఆ విశ్వరూపంలో అనంతమైన విశ్వాన్ని, దేవతలని, చివరికి కృష్ణుడిని, అర్జునుడిని (తనని) కూడా దాంట్లో భాగంగా చూశాడు. మన లోపల ఉండే పరమాత్మ వస్తువు గురించి పెద్దలు ఏం చెబుతారంటే-కృష్ణ పరమాత్మ కూడా గీతలో 'నేను, నేను, నేను' అని చెబుతుంటాడు. ఆ 'నేను' తెలుసుకోవడానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఆ 'నేను' తెలియాలంటే మనకి ఉన్నది ఒకటే మనసు. ఈ మనసు ఎటువంటి స్థితిలో పరమాత్మతో సంబంధంలోకి వస్తుంది, ఎట్లాంటి స్థితిలో పరమాత్మతో సంబంధం రాదు అన్న వివేకమే గురువు మనకు కలిగిస్తారు. గురువు యొక్క పరమ ఉద్దేశం మన లోపల ఉన్న పరమాత్మ వస్తువును, సృష్టి అంతా వ్యాపించిన మహా చైతన్యాన్ని మన అనుభవంలోకి తేవడమే. ఆ దైవమే గురువు రూపంలో వచ్చి మనకు ఆ జ్ఞానాన్ని ఇస్తారు. మనకి జన్మ వచ్చిన తర్వాత మూడు స్థితులు ఉన్నాయి, అవి జాగృత్ (మెలుకువ), స్వప్నం (కల), సుషుప్తి (నిద్ర) అనే అవస్థలు. మొదటి అవస్థలో జాగ్రత్‌లో ఉన్నప్పుడు మనసు దేహంతో, స్పర్శతో సంబంధంలో ఉంటుంది, దాన్ని 'దేహాత్మ భావన' అంటారు. ఇది ఉన్నంతసేపు మన లోపల ఉన్న పరమాత్మ దర్శనం కాదు, ఇది దాటాలి. రెండోది స్వప్నంలో మనసు తన శక్తి చేత కలలుకంటూ అనుభవిస్తుంది. అది జాగృత్ యొక్క సత్యాన్ని ఎరుకలోకి తేవడానికి పరమాత్మ దయతో ఏర్పరిచిన అద్భుతమైన అనుభవం. ఆ తర్వాత నిద్రలో మనసు ఖాళీ

అయిపోతుంది. మరి నిద్రలో ఖాళీ అయితే జ్ఞానం వస్తుందా అంటే రాదు; పొద్దున్నే లేవగానే మళ్లీ దేహాత్మ భావన వస్తుంది. కానీ 'నిద్రలో మనసు ఖాళీ అవుతోంది' అని తెలియటమే జ్ఞానం. అది గురువు మనకు సూచన చేసి, దయతో, శ్రద్ధతో చాలా సునాయసంగా చేసి పెడతారు. కృష్ణ పరమాత్మ అర్జునుడికి ఆ 'నేను' పోగొట్టాడు. మనందరికీ 'నేను సంసారం చేస్తున్నాను, నేను కష్టపడుతున్నాను, నాకు ఇన్ని కష్టాలు దుఃఖాలు ఉన్నాయి' అనే భావనలు ఉండి జీవితం అంతా దుఃఖమయంగా ఉంటున్నది. ఈ దుఃఖం పోవాలంటే 'ఈ పని నేను చేయట్లేదు, ఇదంతా ఈశ్వరుడి కార్యమే, నేను నిమిత్తమాత్రుడినే' అని మనకు అర్థం కావాలి. ఈ 'నేను' పోతే గానీ ఇది అర్థం కాదు. గురువు అనుగ్రహం ఉంటే తప్పితే ఆ 'నేను' పోదు. కృష్ణుడు అర్జునుడికి ముందుగానే ఆ రుద్రుడు వచ్చి అందరినీ సంహరిస్తూ వెళ్ళిపోతున్నట్లు చూపెట్టాడు. అంటే యుద్ధం ఇప్పటికే జరిగిపోయింది, మనం చూస్తున్న జీవితం అంతా గతమే కానీ భవిష్యత్తు కానే కాదు. మనం 70 ఏళ్ళు, 80 ఏళ్ళు ఉంటాం అనుకుంటాం కానీ, ఇదంతా జరిగిపోయిన గతాన్ని చూస్తున్నాం. ఈ సత్యం గురు అనుగ్రహంతో బోధపడుతుంది. అర్జునుడికి 'నేను చేస్తున్నాను' అనే భావనతో పాటు విషాదం, సంశయం పోయాయి. జీవితంలో 'నేను' పోతే ఇక అంతా బాగా జరిగిపోతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అనే భావాలన్నీ పోయి చివరికి గురువు అనే భావం కూడా అదశ్యమవుతుంది. అక్కడ మిగిలేది కేవలం 'నేను' అంటే ఆత్మస్వరూపమైన సత్య వస్తువు మాత్రమే. గురువుగా కృష్ణుడు చేసిన పని అర్జునుడిలోని 'నేను'ని పోగొట్టడమే. అంతకుముందు అర్జునుడు శివుడి దగ్గర తపస్సు చేసి అస్త్రాలు సంపాదించాడు కానీ ఆ జ్ఞానం కలగలేదు. కృష్ణ పరమాత్మ అనుగ్రహం చేత చిన్న దేహాత్మ భావన అనే పొర తీసివేసి, విభజన పోగొట్టి ఆ స్థితిని ఇచ్చాడు.

## నా సాధనలో గురు అనుగ్రహం

నా సాధన 1981లో మొదలైంది. నాకు పూజ చేయడం, సంప్రదాయాలు అప్పుడు పెద్దగా తెలియవు, ఇప్పటికీ తెలియవు. 1981లో నేను ఇంటర్మీడియట్



తప్పాను, భగవంతుడి దయ వల్ల! ఎందుకంటే తప్పడం వల్లే ఇంట్లో కూర్చునే అవకాశం దొరికింది. 1981లో ఇంటర్ తప్పడం, మా తాతగారు పోవడం, అక్కడ ఉన్న జ్యోతిష్యం పుస్తకాలు చదవడం జరిగింది. జ్యోతిష్యం బాగా చెప్పాలంటే హనుమదుపా సన చేయాలని తెలిసి, ఒక చిన్న ఆంజనేయ స్వామి విగ్రహం తెచ్చుకుని, సాయంత్రం అభిషేకం చేసుకుంటూ, పూజలు మొదలు పెట్టాను. ప్రతి ఎనిమిది సంవత్సరాలకి మనిషి ప్రోగ్రెస్ అవుతారని శాస్త్రం చెబుతుంది, 12 ఏళ్లలో సాధన పూర్తవుతుంది. నేను సాయంత్రం పూజలు చేస్తుంటే కొద్ది రోజుల్లోనే ఆంజనేయ స్వామి స్వప్నంలో కనపడి జ్యోతిష్యం నేర్పడం, రేపు ఫలానా వాడు వస్తున్నాడు ఈ మాట చెప్పు అని చెప్పడం, ధ్యానం ఎలా చేసుకోవాలో గైడెన్స్ ఇవ్వడం జరిగింది.

సరిగ్గా ఎనిమిదేళ్లు వచ్చేసరికి1988 మార్చి 17వ తారీఖున ఆంజనేయ స్వామి కలలో కనపడి "నీ గురువు ఉన్నారు వెళ్ళు" అని గురువుగారిని చూపెట్టారు. అలా గురువుగారి దర్శనం అవ్వడం, ఆయన నాకు అయ్యప్ప మాల వేసి దీక్ష ఇవ్వడం జరిగింది. 1994లో గురువుగారిని మా ఊరు రమ్మని అడిగితే మొదట రానన్నా, ఆ తర్వాత వచ్చి బలుసుపాడు వద్ద ఉన్న రిక్విన్ ఫ్లోర్ కర్మాగారంలో విడిది చేశారు. అప్పటికి నాకు ఇంకా పెళ్లి అవ్వలేదు. ఆసక్తి కూడా లేదు. ఒకరోజు రాత్రి భోజనం చేసే టైంలో గురువుగారు నన్ను దగ్గరికి పిలిచి, ఒక ముద్ద నా చేతిలో పెట్టి "రమణా, నువ్వు పెళ్లి చేసుకోవాలి, నీకో పిల్లవాడు ఉంటాడు, నువ్వు ఈ సంసారంలో ఉండే తరించాలి, ఇది నా డిజైన్" అని చెప్పారు. 1995లో దక్షిణ దేశ యాత్రకు వెళ్లినప్పుడు "స్వామి, నాకు పెళ్లి వద్దులేండి" అని గురువుగారితో అంటే, ఆయన ఎంతో ప్రేమతో "నీ ఇష్టమేంటి, మేలో చేసేద్దాం"

అన్నారు. ఆ లోపు లక్ష్మితో పెళ్లి కుదిరి, పెళ్లి అయిపోయింది. నేను రోజంతా స్వామి ధ్యాసలోనే గడిపేవాడిని. ఉద్యోగం కోసం ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూనే తెల్లవారుజామున 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా ధ్యానం చేసుకోవడం, లేదా ఆఫీస్ నుంచి రాత్రి 8కి వచ్చాక 11 నుంచి 2 గంటల దాకా జపం చేసుకోవడం చేసేవాడిని. 1988లో గురువుగారి పరిచయం అయ్యాక నాలో 'శుభేచ్ఛ' ఏర్పడింది. అప్పటిదాకా ఇతరుల భవిష్యత్తు తెలిస్తే చాలు అనుకునేవాడిని, కానీ గురు పరిచయం అయ్యాక "నేను ఎవరో నాకు తెలియాలి" అనే ఆకాంక్ష ఏర్పడింది. 1996 నవంబర్ 26 ప్రాంతాల్లో నేను దీక్షలో ఉండగా, ముందురోజు గురువుగారు నా కలలో కనపడి "రమణా, రేపు నీ ప్రయాణం పూర్తవుతుంది, నిన్ను అనుగ్రహిస్తున్నాను" అని చెప్పారు. మర్నాడు తెల్లవారుజామున లేచేసరికి సృష్టి అంతటా వ్యాపించి ఉన్న ఆ సత్య వస్తువుతో, ఆత్మానుభూతితో నన్ను అనుగ్రహించారు. నేను పెరట్లో తులసి చెట్టు దగ్గర మంచం వేసుకుని రాత్రంతా జపం చేసుకుంటూ పడుకుంటే, తెల్లవారేసరికి గురువుగారు వచ్చి "రమణా లే" అని మూడింటికి లేపేవారు. ఇదంతా అయిపోయాక "ఇదంతా నువ్వు చేశావను కుంటున్నావా? నేను చేయించాను" అనేవారు. ఉపాసన మనం చేసేది కాదు, గురువు చేస్తేనే అనుగ్రహం అవుతుంది. ఈ సభ ఎంత సత్యమో, గురువుగారి ప్రెజెన్స్ ఇక్కడ అంత సత్యం. ధ్యానంలో కూర్చున్నప్పుడు ఏదో ఒక స్ఫురణ వచ్చేది, అది చేస్తే సక్సెస్ అయ్యేది. పేరు నాది, కానీ ఆదేశం గురువుగారిదే. నా మనసులో "లోపలే చూస్తున్నాను కదా, ఇక విగ్రహారాధన ఎందుకు?" అని అనుకుంటే, గురువుగారు కారులో వస్తూ నందిగామ దగ్గర "విగ్రహారాధన ఉన్నా లేకపోయినా పర్లేదు, నిన్ను నువ్వే ఆరాధించుకో" అని నా లోపలి ఘర్షణను తీసేశారు. మీ అందరికీ నేను చెప్పదలుచుకున్నది ఏంటంటే నా సాధన వల్ల నాకు ఆత్మానుభవం అయిందని నేను చెప్పట్లేదు. నా 18 ఏళ్ల సాధన వల్ల నాకు ఆత్మానుభవం కాలేదు, కేవలం గురువుగారి స్పర్శ చేత, గురువుగారి అనుగ్రహం చేతనే అయింది. సూర్యుడి కిరణాలు సోకగానే పువ్వు ఎలా వికసిస్తుందో, గురువు స్పర్శ చేత సాధకుడిలో వికాసం జరుగుతుంది. సాధన వల్ల ఫలం రాదు, గురు

సమక్షంలోనే జ్ఞానం పుడుతుంది. గురువుగారి వైభవం ఏంటంటే ఆయన మనలో 'నేను'ని పెరగనివ్వరు. ఒకవేళ ఇప్పుడు పోకపోయినా, చచ్చిపోయేటప్పుడైనా ఆ 'నేను' పక్కన పెట్టి ముక్తిని ఇస్తారు. 1988 నుంచి 2015 దాకా నేను గురువుగారిని చూశాను, ఆయన ఏ క్షణంలోనూ ఆ సత్య స్థితి నుంచి చెదరలేదు. పేపర్ చదువుతూ కూడా ఆయన ధ్యానంలో ఉండేవారు. 88లో నేను "ఆంజనేయ స్వామి కనపడ తారా?" అని అడిగితే, "ఆయన వెనకాలే ఉన్నారు, నిన్ను నువ్వు పోగొట్టుకున్నప్పుడు కనిపిస్తారు" అని గురువుగారు నాకు సత్య భిక్ష పెట్టారు. నేను ఆ సత్యాన్ని అనుభవించానని నా గురువు మీద ప్రమాణం చేసి ధైర్యంగా చెబుతున్నాను. అట్లాంటి గురువు మనకు దొరకడం మన అదృష్టం.

## వచ్చే తరాలకోసం విజ్ఞప్తి

ఈ కృష్ణాష్టమి రోజున మీ అందరినీ నేను కోరుకునేది ఏమిటంటే నెక్స్ట్ జనరేషన్‌కు సత్య వస్తువుపై దృష్టి లేకుండా పోతోంది. పిల్లలకి ఆధ్యాత్మిక వార సత్వాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. కృష్ణుడు భగవద్గీత ఇస్తే, మన గురువుగారు 'మహర్షుల చరిత్ర', 'భారతీయత', 'భగవద్గీత' రాశారు. మన పిల్లలు అమెరికాలో ఉన్నా ఎక్కడ ఉన్నా సరే, రోజూ ఒక మహర్షి చరిత్ర కథ చెప్పండి. అప్పుడు పిల్లలకు మన సంస్కృతి గొప్పతనం తెలిసి పక్కన ఉన్నవారిని గౌరవిస్తారు. ఆ సాహిత్యాన్ని నెక్స్ట్ జనరేషన్‌కు అందిస్తేనే మనం గురుఋణం తీర్చుకున్నవాళ్లం అవుతాం. గురువుగారు ఎప్పుడూ సముద్రపు అలలాగా మనల్ని తాకడానికి, మనకు కనపడటానికి నిరంతరం తపిస్తూనే ఉంటారు. దీన్ని సద్వినియోగం చేసుకుని అందరూ గురు దర్శనం పొందాలని కోరుకుంటున్నాను. నాకు పెద్దగా సమాజంలోకి వెళ్లి మాట్లాడాలని లేదు, మనసు ఏకాంతాన్ని, నివృత్తి మార్గాన్ని కోరుతోంది. మీ ఇంట్లో ఒకడిగా, గురు కుటుంబంలో ఒకడిగా మాత్రమే మీతో పంచుకున్నాను. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన బసవరాజు గారి దంపతులకు, పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ, పరమ పూజ్య గురుదేవులకు సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తూ ముగిస్తు న్నాను. ధన్యవాదాలు.

* * * * *

# శ్రీ గురుధాం ధర్మక్షేత్రంలో వినాయక చవితి పర్వదినం

శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదంపతుల ఆధ్వర్యంలో ది.14.09.2026 నాడు శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో పర్యావరణ పరిరక్షణకు అనువైన రీతిలో వినాయక చవితి పర్వదినాన్ని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. శ్రీ గెంటేల ఆనంద శంకర్, శ్రీమతి హర్షితా దంపతులు సహా యువత, బాలలు సామూహిక చవితి పూజల్లో పాల్గొన్నారు. ప్రతి ఏటా కన్నుల పండుగగా జరిగే ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు హాజరయ్యారు. తెలంగాణా రాష్ట్రం కోదాడకు చెందిన శ్రీ నల్లాన్ చక్రవర్తుల శ్రీరంగాచార్యుల వారి బృందం, వరంగల్‌కి చెందిన లాయక్ అహ్మద్ వారి బృందం భక్తి గీతాలతో అలరించారు.







## శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినం



ది. 04. 09. 2026 శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని బలుసుపాడు శ్రీ గురుధాం ధర్మక్షేత్రంలో సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల వారి సన్నిధిలో శ్రీకృష్ణ పరమాత్మకు పూజ నిర్వహిస్తున్న శ్రీ గెంటేల ఆనంద శంకర్, శ్రీమతి హర్షితా దంపతులు.




## సత్యదర్శనము - విఘ్నేశ్వరతత్త్వము - గురుశిష్య సంబంధం

శ్రీ మహా గణపతయే నమ:. జగత్తులో సమస్త విఘ్నములు తొలగిపోవడానికి, సకల పురుషార్థములు సిద్ధించడానికి గణపతి ప్రార్థన అత్యంత ముఖ్యమైనది. అయితే, నేటి సమాజంలో గణేశ్వరుని పూజించే విధానంలోనూ, ఆయనను కోరే కోరికల్లోనూ ఒక తీవ్రమైన లోపం, అజ్ఞానం ఆవరించి ఉన్నాయి. స్వామిని ఎన్ని అడుగుల విగ్రహంగా మలిచాము, ఎంత వైభవంగా పందిళ్లు వేసాము అనే బాహ్య భౌతిక ఆలోచనల్లో మునిగిపోతున్నారే తప్ప, అసలు గణపతిని అడగవలసింది ఏమిటో మర్చిపోతున్నారు. మానవ జీవితంలో ఎదురయ్యే అతిపెద్ద విఘ్నం ఏమిటంటే, సరియైన 'సంబంధం' (రైట్ రిలేషన్ షిప్) లేకపోవడమే. ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలకు, లౌకిక ఆధ్యాత్మిక సాధనలకు సంబంధాలు సరిగా లేకపోవడమే ప్రధాన ఆటంకమవుతోంది. మనకి జన్మనిచ్చిన తల్లిదండ్రులు, సహోదరులు, బంధువులు, స్నేహితులు మరియు ఈ సమగ్ర సమాజంతో మన సంబంధం ఎలా ఉండాలి, ఏ దృష్టి వల్ల విఘ్నేశ్వరునికి ఆ 'గణాధిపత్యం' సిద్ధించిందో, అటువంటి దివ్యమైన సరియైన దృష్టి మనకూ కలగాలని ప్రార్థించడమే నిజమైన వినాయక చవితి అంతరార్థం. 'శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ । ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే' అని స్మరించినప్పుడు, మనలో ఉన్న అజ్ఞానాన్ని, తప్పు సంబంధాలను తొలగించి, సత్సంబంధాలను నెలకొల్పే జ్ఞానాన్ని విఘ్నేశ్వరుడు ప్రసాదిస్తాడు.

ప్రకృతితో మనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసేవాడే గణపతి. అందుకనే వినాయకచవితి నాడు రకరకాల ఆకులు, పత్రాలు, ఫలాలు తెచ్చి స్వామికి అర్చన చేస్తాం. ఏ ప్రకృతి మనకు ఆధారంగా ఉందో, ఆ ప్రకృతితో మనకున్న సంబంధాన్ని

ధర్మబద్ధంగా నిలుపుకోవడమే అసలైన ధ్యానం. ఏ పని తలపెట్టినా ముందుగా గణపతిని ఎందుకు ప్రార్థిస్తామంటే, ప్రతి పనిలోనూ సంబంధం బాగుండాలి కాబట్టి. సరియైన సంబంధమే జీవన ముక్తికి మార్గం చూపిస్తుంది. సమాజంలో ఒక వ్యక్తి మనకు తండ్రిగా, తాతగా, గురువుగా, స్నేహితుడిగా, బంధువుగా లేదా ఒక యాచకుడిగా ఎదురవ్వవచ్చు. అక్కడ మనం బాహ్య రూపాలను, బంధుత్వాలను మాత్రమే చూడకూడదు. మన అంతరంగ లక్ష్యం ఏమిటి, ఆ వ్యక్తితో మనకు ఉండవలసిన సరైన సత్సంబంధం ఏమిటి అనేది చాలా ముఖ్యం. మనం ఒక రామాయణమో, భారతమో చదవడానికి పుస్తకం తీసి రెండు పేజీలు చదివి పక్కన పెడితే, మిగిలిన వంద పేజీలు అదే వచ్చి మన ముందుకు విప్పుకోదు; మనమే వెళ్ళి చదవాలి.

గురువు ఎటువంటివాడంటే, ఆయనకు స్వార్థపూరిత కోరికలేవీ ఉండవు. ఆయన వద్దకు శిష్యుడు వెళ్ళినప్పుడు కేవలం పుస్తకాల్లోని సమాచారాన్ని అందించడం మాత్రమే గురువు ఉద్దేశం కాదు; శిష్యుడిని కూడా తనతో సమానంగా ఒక గొప్ప జ్ఞాన వెలుగుగా తీర్చిదిద్దడమే ఆయన ఏకైక సంకల్పం. గురువు తన శిష్యుడిలో ఉన్న ఆత్మతత్వాన్ని గుర్తిస్తాడు. ఆయన శిష్యుడిని ఒక తక్కువ స్థాయిలోనో లేదా అజ్ఞానిగానో ఎప్పుడూ చూడడు. శిష్యుడిని కూడా తనలాగే పరిపూర్ణమైన సత్యస్వరూపిగా, జ్ఞానమూర్తిగా మార్చడమే గురువు యొక్క ఉద్దేశం. ఒక వెలుగు నుండి ఇంకొక వెలుగు వెలిగినట్లు, గురువు తన వద్దకు వచ్చిన ప్రతి సాధకుడిని తనతో సమానమైన ఉన్నత స్థితికి తీసుకువెళ్ళి ఆత్మానుభూతిని కలిగిస్తాడు. వెయ్యి పుస్తకాలు చదివితే వచ్చే జ్ఞానం కంటే గురువు ప్రసన్నత ద్వారా లభించే జ్ఞానం అనంతమైనది.

అయితే నేడు ప్రజలు తమ ప్రవర్తనలోని లోపాలను గుర్తించడం లేదు. “స్వామి! నా ప్రవర్తనలో సంబంధాలు సరిగా లేకపోతే, ఆ అజ్ఞానానికి, దుష్ప్రవర్తనకు విఘ్నం కలిగించి, సరియైన సత్ప్రవర్తనను, సద్బుద్ధిని ప్రసాదించు” అని గణపతిని అర్థించాలి. నీ భార్య, నీ తండ్రి లేదా నీకు పరిచయమైన ఏ వ్యక్తి అయినా నీకు గురువు కావచ్చు. కేవలం పేర్లు పెట్టి పొగడటం వల్ల ఎవరికీ ఏ లాభమూ లేదు. సత్యం తెలిసిన గురువుకు నీ పొగడ్తలతో పనిలేదు; నీ భక్తిలో, మాటలో నిజమైన రుచి లేకపోతే ఆయన హృదయం స్పందించదు. నాటకీయమైన పొగడ్తలకు గురువు

మోసపోడు. శిష్యుడిలో ఏ లోపాలు ఉన్నా వాటిని సరిచేసి, వాడిని ఆత్మజ్ఞానంలో వృద్ధిలోకి తీసుకురావడమే గురువు ధర్మం. గురువు తన శిష్యుడిని కేవలం ఒక అనుచరుడిగా ఉంచుకోవాలని అనుకోడు; తనకంటే గొప్పగా, తనతో సమానమైన జ్ఞానిగా మార్చడానికే ఆయన సదా తపిస్తాడు.విద్యాభ్యాసంలో పుస్తకం దగ్గరకు వెళ్ళి పాఠం చదివి, పరీక్ష రాసి పాస్ అయితే పదవ తరగతికి ముక్తి లభించి పైచదువులకు వెళ్లినట్లే, జీవితంలో కూడా సరైన మార్గంలో పయనించడమే ధ్యానము, ధర్మము, అర్థము, కామము మరియు మోక్షము. మనం ఒక వ్యక్తి వద్దకు లేదా గురువు వద్దకు వెళ్లేటప్పుడు మన ఉద్దేశం చాలా ముఖ్యమైనది. నిప్పు, నీరు వాటి స్వభావాన్ని వీడవు. నిప్పు మన ఇంట్లో ఉన్నా, ప్రాణస్నేహితుడి ఇంట్లో ఉన్నా కాలుస్తుంది. జీవితంలో ఎదురయ్యే వ్యక్తుల విషయంలో కూడా వారి నిజమైన తత్వాన్ని గుర్తించాలి. మనల్ని ఉద్ధరించడానికి, మనల్ని మన పూర్ణ స్థితికి చేర్చడానికి వచ్చిన గురు సంబంధాన్ని సరిగా అర్థం చేసుకుని పట్టుకుంటే తప్పక ఉత్తీర్ణులమవుతాము. అప్పుడే గురువు కృతకృత్యుడై ఎంతో సంతోషిస్తాడు.

పువ్వు తన సువాసనను వెదజల్లుతుంది, దాని దగ్గరకు మనమే వెళ్ళాలి. అలాగే పరమాత్మ వెలుగుగా, గురు రూపంలో భౌతిక రూపంతో మన దగ్గరకు వచ్చినప్పుడు మనలోని దైవాంశను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలి. లేకపోతే ఈ జన్మ వ్యర్థమైపోతుంది. ఒంటరితనం వేరు, ఏకాంతం వేరు. ఒంటరితనం మనిషిని మానసిక బాధలోకి నెట్టి, దుఃఖాన్ని పదింతలు చేస్తుంది. నేటి పిల్లలు, యువత గణపతిని వేడుకోవాల్సింది భౌతిక రూపాల ఎత్తులు కాదు; "నా చదువుతో, నా పుస్తకాలతో, నా తల్లిదండ్రులతో, నా తోటివారితో మరియు ఈ సమాజంతో నా సంబంధం సరిగా ఉండేలా మార్గదర్శకత్వం చేయి స్వామి" అని ప్రార్థించాలి.

మన ప్రవర్తనలో ఎక్కడైనా ఆటంకం, అజ్ఞానం, తప్పులు ఉంటే వాటిని తొలగించి, సరియైన సంబంధాలను ఇచ్చే మూల గణపతి ఆయన. కానీ నేడు పసుపు గణపతి, మట్టి గణపతి అంటూ మొదలుపెట్టి 40 అడుగులు, 50 అడుగుల విగ్రహాల వ్యామోహంలో పడి అసలైన అంతరార్థాన్ని మర్చిపోతున్నారు. ఇల్లు లేదా కారు వంటి ఏ వస్తువునైనా సరిగా వాడుకుని శుభ్రం చేసుకుంటే అది పదికాలాల పాటు మన్నుతుంది. వాడకుండా అలా పడేస్తే తుప్పు పట్టిపోతుంది.

అలాగే గురువు జ్ఞానాన్ని బోధించడానికి వచ్చినప్పుడు మనలో స్వీకరణ గుణం లేకపోతే మనకు మేలు జరగదు. మనకు మనమే ఒక అజ్ఞానమనే తెరను కప్పుకుంటే గురువు ఎదురుగానే ఉన్నా మనం ఆయనను చూడలేము. మనసును, హృదయాన్ని విప్పి ఆ జ్ఞానాన్ని స్వీకరించినప్పుడే సంబంధం మెరుగుపడుతుంది.

మన జన్మకు కారణమైన తల్లిదండ్రులు, తోటివారు, సమాజంతో సంబంధం బాగున్నప్పుడే సమస్త విఘ్నాలు తొలగిపోతాయి. ఇదే ధర్మం, అర్థం, కామం, మోక్షం. ప్రకృతితో, వ్యవస్థతో సంబంధం దెబ్బతింటే జీవితం అస్తవ్యస్తమవుతుంది. బ్యాటరీని సరైన దిశలో అమర్చినప్పుడే కాంతి వస్తుంది; తలక్రిందులుగా వేసి వెలగలేదనడం మన అజ్ఞానమే అవుతుంది. మనలోని తమస్సు, రజస్సు అనే గుణాలను ఉపశమనం చేసి సరియైన జ్ఞానాన్ని ఇచ్చేవాడే గణాధిపతి. పుస్తకం అట్ట మీద ఉన్న పేరును బట్టి పుస్తకం లోపలి జ్ఞానాన్ని ఎలాగైతే అంచనా వేయలేమో, అలాగే భౌతికమైన పేరుప్రతిష్ఠలను బట్టి పరమాత్మ సంబంధాన్ని విస్మరించకూడదు. మానవ సంబంధాలు, దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న ఈ రోజుల్లో, మనిషికి మనిషే, మనిషికి తన మనసే పెద్ద శిక్షగా మారుతున్న తరుణంలో వినాయక చవితి రోజున సరియైన సంబంధాల కోసం ప్రార్థించాలి.

అహంకారాల వల్ల, ఈగోల వల్ల ఎవరికీ ఏ లాభమూ లేదు. అహంకారంతో బ్రతికితే చివరకు మిగిలేది ఒంటరితనమే. ఆ ఒంటరితనం లక్షల జన్మల దుఃఖానికి కారణమవుతుంది. మనకు కావలసింది శాంతినిచ్చే ఏకాంతం కానీ, బాధనిచ్చే ఒంటరితనం కాదు. సత్కార్యాన్ని, సత్యమార్గాన్ని అర్థం చేసుకుంటే ఏకాంతం లభిస్తుంది; అపార్థం చేసుకుంటే ఒంటరితనం ప్రాప్తిస్తుంది. గురువు చూపించే సత్యమార్గంలో పయనించి, ఆయన శిష్యుడిని తన సమాన స్థాయికి తీసుకువెళ్లాలనే తపనను అర్థం చేసుకున్నప్పుడే జీవుడికి బంధనాల నుండి ముక్తి లభిస్తుంది. కాబట్టి సద్గురు శివానంద భగవానుల దివ్య చరణాలను హృదయాన నిలుపుకుని, పిల్లలకు పెద్దలు ఈ సరియైన ఆధ్యాత్మిక వివేకాన్ని, గురు-శిష్య సంబంధాల ప్రాముఖ్యతను నేర్పించాలి. పిల్లలు పెద్దల అనుభవాన్ని, గురువుల జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఆ విధంగా సమాజం నవ సమాజంగా, సస్యశ్యామలంగా వర్ధిల్లాలని, భారతమాత దివ్య ఆశీస్సులు అందరికీ కలగాలని ప్రార్థించడమే శ్రీ మహా గణపతి తత్వము.

# అందరి కోసం ఉన్న దేవుడు విఘ్నం కోసం ప్రార్థన!

## (వినాయక చవితి ఆలోచనలు!)

– శ్రీ గెంటేల ఆనంద శంకర్

ఏ పిల్లవాడిని అయినా ఒక దేవుడిని గీయమని అడగండి, చాలా వరకు వాళ్లు వినాయకుడినే గీస్తారు. గుండ్రటి పొట్ట. పెద్ద చెవులు. పక్కనే ఓపికగా నిలబడిన చిన్న ఎలుక. మరే దేవుడూ ఇంత సులభంగా ఇష్టపడటానికి, ఇంత సులభంగా గీయడానికి ఉండరు.

ఆశ్చర్యంగా, వారు అత్యంత గంభీరమైన దేవుళ్లలో ఒకరు కూడా. ఏ పూజ మొదలైనా, ఏ సందర్భమైనా, ఏ దేవుడిని పూజించినా, ముందుగా వినాయకుడినే పూజిస్తారు. ఇది చిన్న ఆచారం కాదు. ఇది ప్రతిచోటా, ప్రతిసారీ, మినహాయింపు లేకుండా పాటిస్తారు. అథర్వణ వేదంలోనే వారి గురించి ఒక స్తోత్రం ఉంది, గణపతి అథర్వశీర్షం, అది వారిని మూలాధారానికి అధిపతిగా పేర్కొంటుంది, మన శక్తి అంతా పుట్టే మూలం. తంత్ర సంప్రదాయంలో అత్యంత ఉన్నతమైన, రహస్యమైన ఉపాసనలు కూడా వారితోనే మొదలవుతాయి. లక్ష్మీ గణపతి, అంటే వినాయకుడిని లక్ష్మీ దేవితో కలిపి పూజించడం, ఒక వ్యక్తి చేయగల అత్యంత శక్తివంతమైన సాధనల్లో ఒకటిగా భావిస్తారు. చాలా తక్కువ దేవుళ్లు ఇంత విస్తృతంగా ఉంటారు. పరీక్షకు ముందు ఒక పిల్లవాడు చేసే సాధారణ ప్రార్థన నుండి, వేదాల్లో వారిని అన్నింటికీ మూలంగా పేర్కొనే స్తోత్రం వరకు, ఏదోలా వినాయకుడు రెండు కొసలనూ అందుకుంటారు.

కానీ వినాయక చవితి రోజున, ఆ గొప్పతనమంతటికీ ముందు, ఒక చాలా చిన్న ప్రారంభం ఉంటుంది. చాలా ఇళ్లలో, పసుపుతో చేసిన చిన్న వినాయకుడు లేకుండా పూజ మొదలవ్వదు. వారాల ముందే వేదిక మీద పెట్టే పెద్ద రంగుల విగ్రహం కాదు. చేతితో ఒత్తి తయారుచేసిన పసుపు ముద్ద, అరచేతిలో పట్టేంత



చిన్నది. దీనికి ఒక ప్రత్యేక పేరు కూడా ఉంది, హరిద్రా గణపతి. ఇది లేకుండా, పూజ మొదలవ్వదు. పట్టుబట్టలు కట్టిన గొప్ప మట్టి విగ్రహం పక్కన, ఒక పసుపు ముద్ద పెద్దగా పట్టించుకోవాల్సినంత ముఖ్యమైనదిగా అనిపించకపోవచ్చు. కానీ సంప్రదాయం దీనిని పట్టుబడుతుంది. సంవత్సరంలో అతిపెద్ద పండుగ, మొదట, దేవుడి అత్యంత చిన్న, సాధారణమైన రూపం మీదే ఆధారపడి ఉంటుంది.

దీనికి ఒక కారణం ఉంది, అది వినాయకుడు ఎలా పుట్టారు అనే దాంట్లోకి వెళుతుంది. పార్వతీ దేవి తన శరీరం శుభ్రం చేసుకోవడానికి వాడిన పసుపు ముద్దతో వారిని తయారుచేసి, ప్రాణం పోశారు. వారు ఎవరికైనా దేవుడు కావడానికి ముందు, ఆమె సృష్టి. అయినప్పటికీ, దైవత్వం వారిని కష్టాల నుండి తప్పించలేదు. వారు పుట్టిన కొద్దిసేపటికే, ఒక పొరపాటు గుర్తింపు వల్ల, వారి తండ్రి పరమశివుడు వారి తలను నరికేశారు. వారిని తిరిగి బతికించడానికి, ఉత్తరం వైపు తల పెట్టి పడుకున్న మొదటి జీవి తల, ఏనుగు తల కావాల్సి వచ్చింది. తన సొంత తల్లి చేతులతో పుట్టిన దేవుడు కూడా, ఇంత శక్తిమంతుడైన వ్యక్తి కూడా, తిరిగి పూర్తి కావడానికి ముందు నష్టాన్ని అనుభవించాల్సి వచ్చింది. చివరికి, కర్మకు ఎవరూ

అతీతులు కారని తేలింది. దేవుడు కూడా తాను అనుభవించాల్సినది అనుభవించాల్సిందే.

## ఉద్దేశం మారిన పూజ

అందుకే వినాయకుడు ఎప్పుడూ పిల్లలకు ఇంత సహజంగా దగ్గరయ్యారు. వారు హనుమంతుడిలాగానే, ఆటపాటలతో, కొంచెం అల్లరిగా, ఎప్పుడూ క్షమించేవారిగా ఉంటారు. ఇంత తేలికగా, శ్రమ లేకుండా ప్రేమించగలిగే దేవుళ్లు తక్కువ. అందుకే బహుశా, కాలక్రమేణా, వారి చుట్టూ ఇంత సందడి పెరిగింది: సంగీతం, రంగురంగుల పందిళ్లు, నిమజ్జనం కోసం సాగే పొడవైన ఊరేగింపులు.

ఆ సందడిలో తప్పేమీ లేదు. కానీ ఎక్కడో, ఉత్సవం దాని కింద ఉన్న పూజ కంటే పెద్దదిగా మారిపోయింది. అలంకరణలు ఎంచుకోవడానికి, ఊరేగింపు ప్లాన్ చేయడానికి కుటుంబాలు, ఈ పండుగంతటికీ మొదలైన పసుపు విగ్రహంతో కూర్చోవడం కంటే ఎక్కువ సమయం గడుపుతాయి. సందడి ప్రధాన విషయంగా మారిపోయింది, ఆ సందడికి అసలు కారణమైన ప్రార్థన నిశ్శబ్దంగా పక్కకు తప్పుకుంది. మనం వినోదాన్ని ఆస్వాదిస్తాము, మనం దేనికోసం వచ్చామో అడగడం మర్చిపోతాము.

## గురువుగారు మరియు నాన్నగారి మాటలు

చాలామంది గమనించని ఒక విషయం గురువుగారు వినాయకుడి గురించి చెప్పేవారు. మనం వారిని విఘ్నాలు తొలగించేవారు అంటాము, సరిగ్గా దాని కోసమే వారిని ప్రార్థిస్తాము, మనకి విఘ్నాలు కలగకుండా చూసుకోమని. కానీ గురువుగారు దీనికి వ్యతిరేకంగా కూడా ప్రార్థించమని చెప్పేవారు. నీ సొంత తప్పు దారికి మరియు నీ సాధనకి అడ్డుగా వచ్చే దేనికైనా ఒక విఘ్నం పెట్టమని వినాయకుడిని అడుగు, అని వారు చెప్పేవారు. తప్పు దారిలో వెళ్లాలనుకునే నీలోని ఆ విషయాన్నే వారు అడ్డుకోనివ్వు.

ఈ ఒక్క మార్పు విఘ్నం అంటే అసలు ఏమిటో మార్చేస్తుంది. అది మనకు జరిగేది కాకుండా పోతుంది. అది మనం ఉద్దేశపూర్వకంగా అడగగలిగేది, మనవైపే చూపించగలిగేది అవుతుంది.

గురువుగారు దీన్ని ధైర్యంతో ముడిపెట్టారు, కానీ చాలామంది అనుకునే ధైర్యం కాదు. ధైర్యం అంటే గొడవ పెట్టుకోవడం, గట్టిగా అరవడం, వాదనలో నిలబడటం కాదు, అన్నారు వారు. నిజమైన ధైర్యం నీ సొంత సాధనలో నిన్ను నడిపించేది. ఏదైనా నిన్ను నీ సాధన నుండి దూరం చేస్తుంటే, అది ఒక ప్రత్యేక ఆహారం మీద మమకారంలా చిన్న విషయమే అయినా, దాన్ని వదిలేయగలగడమే నిజమైన ధైర్యం.

నాన్నగారు దీనికి ఒక పదును జోడించారు. ధర్మం లేని ధైర్యం అసలు ధైర్యమే కాదు, అన్నారు వారు. ఎవరైనా తప్పు చేస్తుంటే చూసీచూడనట్టు ఉండటానికి నిజమైన ధైర్యం అవసరం లేదు, ఆ ఎవరో నీ సొంత కొడుకో కూతురో అయినప్పుడు కూడా, బహుశా అప్పుడే ఎక్కువగా. చాలామంది ఈ క్షణాల్లో మౌనంగా ఉండిపోతారు, సంబంధంలో ఏర్పడే దూరానికి భయపడి. నాన్నగారు దీన్ని ఉన్నది ఉన్నట్టు చెప్పారు: ప్రేమ ముసుగులో ఉన్న ధైర్యలేమి. అన్నింటినీ కలిపి చూస్తే, గురువుగారు, నాన్నగారు నిజంగా అడిగింది ఇదే. ఎవరితోనైనా పోరాడే ధైర్యం కాదు, మనల్ని ధర్మంగా ఉంచే విఘ్నాల కోసం నిజాయితీగా ప్రార్థించే ధైర్యం. ఇదంతా తర్వాత, ఆలోచించదగిన ఒక ప్రశ్న ఉంది. మన సాధనకు అడ్డంగా ఉన్నదాన్ని తొలగించమని దేవుడిని ప్రార్థించేంత ధైర్యం మనకు ఉందా, అది మనకు డబ్బు పోగొట్టినా, కుటుంబాన్ని పోగొట్టినా, మన సాధనకు అడ్డుగా నిలిచేది ఏదైనా సరే? నిజంగా మనకంత ధైర్యం ఉందా? లేకపోతే, ఎందుకు లేదో మనల్ని మనం అడగడం మంచిది. అలాగే, మన సాధన నుండి మనల్ని దూరం చేసే దేనికైనా, ఏదైనా సరే, ఒక విఘ్నం పెట్టమని వినాయకుడిని అడిగేంత ధైర్యం మనకు ఉందా? దీనికి సమాధానం లేకపోతే, దీని గురించి లోతుగా ఆలోచించుకోవాల్సి ఉంటుంది.

# మనిషిని మనిషిగా చూడటం చేతనైనప్పుడే జ్ఞానానికి పునాది పడుతుంది.

(శ్రీ నిసర్గదత్త మహారాజు గారి నిరూపణలపై
శివశ్రీ రమణ గురుదేవుల ప్రవచన సారం)

**ఆ**ధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే సాధకుడికి జ్ఞాన వైరాగ్యాలు సరిగ్గా లభించాలన్నా, అతని తపస్సు ఎటువంటి విఘ్నాలు లేకుండా సాగాలన్నా ముందుగా అతని చుట్టూ ఉన్న పరివారం మరియు కుటుంబం క్షేమంగా ఉండటం చాలా అవసరం. కుటుంబ వాతావరణం బాగుంటేనే సాధకుడికి ఏకాగ్రత కుదిరి, ఈశ్వరుడిని చేరుకోవాలనే తీవ్రమైన ముముక్షుత్వ భావన నిలబడుతుంది. కాబట్టి భగవంతుడిని అందరి క్షేమం కోసం కోరుకోవడంలో ఏమాత్రం తప్పులేదు. మానవుడు తనను తాను జ్ఞానిగా భ్రమించడం ఈ కాలంలో అతిపెద్ద సమస్యగా మారింది. నిజానికి మనిషిని ముందుగా మనిషిగా చూడటం చేతనైనప్పుడే జ్ఞానానికి పునాది పడుతుంది. బయటి ప్రపంచంలో సమాజంతోను, భార్య, భర్త, పిల్లలు, పక్కవారితోను సరిగా ఉండకుండా, ఎదుటి వ్యక్తిలో కనీసం మానవత్వాన్ని లేదా ఉనికిని కూడా గుర్తించకుండా తానొక్కడినే ఏదో పెద్ద జ్ఞానిని అని అనుకోవడం కేవలం అజ్ఞానమే అవుతుంది. పరమాత్మ అనుగ్రహం పొందేందుకు ఆడంబరాలు, ఆర్భాటాలు, వేల కోట్ల ఖర్చులు అవసరం లేదు. మనసును పవిత్రంగా ఉంచుకోవడమే నిజమైన సాధన. చెంబును బాగా తోమితే దాంట్లో ఉన్న మెరుపు సహజంగానే బయటకు వచ్చినట్లు, సాధకుడు తన మనసును పవిత్రం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తే, పరమాత్మ తనను తాను ప్రకటం చేసుకునే బాధ్యతను ఆయన చూసుకుంటాడు. కాబట్టి ప్రదర్శనల కోసం, అహంకారం కోసం ఆరాటపడకుండా మనసును బాగు చేసుకునే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

భావన అనేది ఒక నగ లాంటిది. నగను ధరించినవాడు ఏ విధంగా నగ కాడో, అలాగే 'నేను ఉన్నాను' అనుకునే భావన ఆత్మ యొక్క నిజస్థితి కాదు.



మేల్కొనగానే దేహస్పృహతో పాటు 'నేను ఉన్నాను' అనే ఉనికి భావం కలుగుతుంది. ఈ భావం రాగానే జీవుడు, జగత్తు, ఈశ్వరుడు అనే ద్వైత భావన విడిగా ఏర్పడుతుంది. ద్వైతం అంటే కేవలం రెండు వస్తువులు ఉండటం మాత్రమే కాదు, దైవంలో లేదా సృష్టిలో నాకంటే భిన్నంగా మరొకటి ఉంది అని అనుకోవడమే ద్వైతం. ఓంకార సాధన లేదా మంత్ర జపం చేసేటప్పుడు పెదవులతో చేసేది జపమైతే, మనస్సుతో గ్రహించి చేసేది ధ్యానమవుతుంది. మనస్సు పరిపూర్ణమైన శ్రద్ధతో మంత్రంలో లయమై పోయినప్పుడు పరిసరాలను, చివరికి తనను తాను

కూడా మర్చిపోతుంది. అలా మనస్సు తనను తాను చూడకపోవడమే నిజమైన ఆత్మ స్థితిని చేరుకోవడం అవుతుంది. సాధారణంగా మానవులు తమకు కీడు జరిగే ఆలోచన వస్తే దానిని పాడాలోచన అని అనుకుంటారు కానీ, ఇతరులకు కీడు కోరే ఆలోచన వచ్చినప్పుడు దానిని తప్పుగా భావించరు. ఎదుటివారి విషయంలో కూడా చెడు ఆలోచన రాకుండా ఉన్నప్పుడే మనిషి ఆధ్యాత్మికంగా బాగుపడినట్లు లెక్క. సమాజంలో రాజులు పూర్వకాలంలో ఆడంబరంగా వేడుకలు చేసింది పౌరులందరికీ నైతిక బాధ్యతను, పరిచయాన్ని పెంచడానికే కానీ అహంకారాన్ని ప్రదర్శించడానికి కాదు. నేటి కాలంలో సింపుల్‌గా సమయానుకూలంగా పనులు చేసుకోవడం మాని, అనవసరమైన ఆర్భాటాలకు పోయి మనశ్శాంతిని పాడుచేసుకుంటున్నారు. కంచి పరమాచార్య స్వామి చెప్పినట్లు సంప్రదాయబద్ధంగా చాలా నిరాడంబరంగా జీవించడం సాధ్యమే.

రాగి చెంబులో మెరుపు అనేది మనం బయటి నుండి తెచ్చేది కాదు, దానికి స్వతహాగా ఉన్న లక్షణమే. మనలోని ఆత్మజ్ఞానం కూడా మన పవిత్రత ద్వారానే స్వయంచాలకంగా వ్యక్తమవుతుంది. నిద్రలో మన ఉనికి మనకు తెలియదు కాబట్టి అక్కడ ఎటువంటి దుఃఖం కానీ, అహంకారం కానీ ఉండవు. కానీ మేల్కొనగానే ఉనికి తెలిసి దానితో పాటు కామం, క్రోధం, భయం, ఆశలు మొదలవుతాయి. అందుకే జ్ఞాని కావడానికి ముందు మనిషిగా జీవించడం నేర్చుకోవాలి. పరమాత్మకు సంపదలు, వెండి బంగారు పాత్రలు ప్రధానం కావు. కృష్ణునికి భక్తితో ఇచ్చే తులసి దళం, లేదా ఎండిన కొమ్మ, ఆఖరికి తులసి చెట్టు పెరిగిన నేల మట్టి అయినా సరే ప్రీతిని కలిగిస్తుంది. కాబట్టి లోపల అంతా భోగ లాలసత, కీర్తి కాంక్ష ఉంచుకుని, బయటకు జ్ఞానిలా నటిస్తే మానసిక కష్టాలు తప్పవు. నిద్రలోని నిష్కల్మష స్థితి దైవీ గుణమైతే, మేల్కొన్నప్పటి అహంకార స్థితి మనుష్య గుణమవుతుంది. చైతన్యం అనేది గుణాతీతమైనది. వివేకానంద స్వామి, ఆదిశంకరాచార్యులు, రామకృష్ణ పరమహంస, నీమ్ కరోలీ బాబా వంటి మహనీయులు చైతన్యాన్ని అనుభవించిన వారే కాబట్టి, వారి జీవన విధానం చాలా సహజంగా, నిరాడంబ

రంగా ఉండేది. నీమ్ కరోలీ బాబా ధనాన్ని అసలు స్పృశించేవారు కారు, దేహ స్పృహ లేకుండా ఆంజనేయ స్వామి భావనలోనే జీవించేవారు. నేటి సమాజంలో కోట్లకు అధిపతులైన రతన్ టాటా, జాకీచాన్ వంటి వారు కూడా తమ సంపదను సమాజ శ్రేయస్సు కోసం ధారపోసి నిరాడంబరతను చాటారు. అలాంటి ఆదర్శాలను సాధకులు అలవరచుకోవాలి.

సాధన చేసే క్రమంలో మానవుడు బుద్ధి శక్తితో లౌకిక అర్థాలను గ్రహించడమే జ్ఞానం అనుకుంటే పొరపాటు పడినట్లే. మాటలు, పదాలు ఒక్కోసారి మనిషిని తప్పుదోవ పట్టించవచ్చు. నిన్ను నీవు జ్ఞానిగా భావించుకుంటే అనవసరమైన గర్వంతో కష్టాల పాలవుతావు. ఆధ్యాత్మిక ప్రయాణంలో శబ్దం కంటే నాదం, అనాహత ధ్వని ప్రధానమైనవి. లోపల నిరంతరం సాగే అనాహత ఓంకార నాదాన్ని మనస్సుతో ఆలకించగలిగినప్పుడు అస్తిత్వ భావం కూడా కరిగిపోతుంది. గురువుగారు చెప్పినట్లు 'పూజ చేస్తున్నది ఎవరు?', 'పూజ ఎవరికి చేస్తున్నారు?', 'పూజా ఫలాన్ని పొందేది ఎవరు?', 'ఆ ఫలాన్ని ఇచ్చేది ఎవరు?' అనే ప్రశ్నలను లోతుగా విశ్లేషించుకున్నప్పుడు సత్యం బోధపడుతుంది. ఉప్పు నీటిలో పుట్టి నీటిలోనే కరిగినట్లు, మనస్సు తన మూలమైన ఆత్మలో లయం కావడమే అసలైన జ్ఞాన స్థితి. బయటి ప్రపంచంలో మున్సిపల్ కార్మికులను, పోలీసులను, సామాన్య సేవకులను కేవలం వారి వృత్తి రూపాల్లో చూడకుండా, వారిలో ఉన్న మానవత్వాన్ని, వారి కష్టాన్ని, వారిలోని ఆత్మ స్వరూపాన్ని గుర్తించగలిగిన రోజే మనిషి నిజమైన జ్ఞానానికి అర్హుడవుతాడు. భగవాన్ రమణ మహర్షి తన ప్రాణత్యాగ సమయంలో కూడా బయట ఉన్న భక్తుల గురించి, నెమళ్ల ఆహారం గురించి ఆలోచించినట్లే, సాధకుడు సర్వజీవులలోనూ సమానత్వాన్ని చూడగలగాలి. 'నేను జ్ఞానిని' అనే అహంకార అభిప్రాయాన్ని పూర్తిగా విడిచిపెట్టి, సద్గురు చెప్పిన సాధనా మార్గంలో పవిత్రతతో జీవిస్తూ, ఓంకార నాదాన్ని అంతరంలో అనుభవించడమే మానవ జన్మకు నిజమైన సార్థకత.

* * * * *

# మనస్సు ప్రతిధ్వనించకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే సత్యాన్ని అందుకోగలుగుతుంది.

**(శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి సందేశంపై శివశ్రీ రమణ గురుదేవుల విచారణ)**

**ఆ**ధ్యాత్మిక ప్రయాణంలో అంతర్ముఖత్వం "అందం" యొక్క పరమార్థాన్ని విశదీకరిస్తుంది. మన రోజువారి జీవనంలో బాహ్య ఉపాధి, మనస్సు చేసే ఆలోచనలు కేవలం వ్యవహారాలకే పరిమితం కావాలి. ఉనికి యొక్క పవిత్రతను మరియు స్వరూప జ్ఞానాన్ని తెలుసుకోవాలంటే కొద్దిసేపు మనస్సు యొక్క పనితీరును, దాని నుండి వచ్చే ఆలోచనా ధ్వనులను పక్కన పెట్టి మౌనంగా ఉండాలి. బాహ్యమైన ధ్వనులకు మనస్సు ప్రతిధ్వనించకుండా ఉన్నప్పుడు, ఆ పవిత్రత వెనుక ఉన్న అనాహత శబ్దం లేదా ఉనికి అనుభవంలోకి వస్తుంది. మనస్సు మౌనమైనప్పుడు బయట ధ్వనులు మనల్ని చేరినా, అంతరంలో నిశ్శబ్దమే మనల్ని ఆవరిస్తుంది; ఇదే అసలైన సౌందర్యం. అద్దంలో మనల్ని మనం చూసుకున్నట్లే, అంతరంలో మన సత్య రూపాన్ని దర్శించినప్పుడు బయట ప్రపంచమంతా అదే పరమాత్మ చైతన్యంగా కనిపిస్తుంది. మనం ఏ మార్గాన్ని లేదా దేవుణ్ణి అనుసరించినా, మనస్సు ప్రతిధ్వనించకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే ఈ సత్యాన్ని అందుకోగలుగుతుంది. ప్రేమ కలిగిన మనస్సుకు బాహ్యంగా ఆలోచనతో జీవించడం, అంతరంగంలో నిశ్శబ్ద మౌనంతో పరమాత్మ నాదాన్ని వింటూ ఆనందించడం రెండూ తెలుసని, ఈ రెండింటి కలయికే శ్రీకృష్ణ పరమాత్మ స్వరూపమని భగవానులు ప్రబోధించారు.

శ్రీకృష్ణమూర్తి గారు పేర్కొన్న గమనింపు యొక్క అంతరార్థాన్ని మనం అర్థం చేసుకోవాలి. నిశ్చలంగా కూర్చొని ప్రవహిస్తున్న నదిని, ఆకాశంలోని చంద్రుని, పసిపాప బోసి నవ్వుని లేదా ఒకరి ఏడుపుని గమనించడంలో ఉన్న అందం బాహ్య వస్తువులలో లేదు. మనం బాహ్యంగా చూసే నది, చంద్రుడు, నవ్వు, ఏడుపు అనేవి క్రియలకు మనం పెట్టిన పేర్లు మాత్రమే. నిశ్చలత్వం అంటే ఏడుపు-

నవ్వు, కష్టం-సుఖం అనే భేద భావాలు మరియు ఆలోచనలు లేకపోవడం. భేదాలు మన చూపులో లేవు, కేవలం మన ఆలోచనలోనే ఉన్నాయి. చూపుతో గ్రహిస్తే అది నిశ్చలం, ఆలోచనతో విభజిస్తే అది చంచలం. జీవనానికి చంచలత్వం (ఆలోచన) అవసరమైనప్పటికీ, అవగాహనకు మాత్రం ఆలోచన లేని నిశ్చలత్వమే కావాలి. దృశ్యాన్ని కాకుండా చూస్తున్న దృక్కును, చూస్తున్న వాడిని దర్శించడమే అసలైన గమనింపు. జ్ఞానులు తమ శ్రద్ధను, స్పృహను అత్యంత విస్తృతంగా ఉంచుతారు. సద్గురు శివానందమూర్తి గారి జీవితంలో జరిగిన రెండు ఘటనల ద్వారా జ్ఞానులకు ఉండే సహజ స్పృహ, అనంత చైతన్యంతో కూడిన ఎరుక ఎంత విస్తృతమైనదో స్పష్టమవుతుంది.

ఉడుత అరుపు ఘటన మరియు గద్ద-పాము పిల్లల ఘటన ద్వారా సౌందర్యం లేదా అందం అంటే బాహ్య కవరింగ్ కాదని, అన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న అనంత చైతన్యాన్ని, ఉనికిని గ్రహించడమేనని ఈ ఉదాహరణలు తేటతెల్లం చేస్తున్నాయి. పూజలో ఉన్న గురువుగారు ఎక్కడో దూరంనుండి వచ్చిన ఉడుత అరుపువిని తమ అదిలింపుతో దానికి ప్రాణభయం కలిగించిన పామును వెళ్లగొట్టారు., మరోసారి ప్రసంగంలో నిమగ్నమై ఉన్న గురువుగారు తమ అదిలింపుతో గద్ద నుండి ప్రమాదం పొంచి ఉన్న పాము పిల్లల్ని పుట్టలోకి పంపి కాపాడారు.

బీజం మొక్కై, వృక్షమై, ఫలించి, చివరికి తనను తాను ఉపసంహరించుకునే క్రమం అంతా మన హృదయంలో జరుగుతున్న పరిణామ క్రమానికి ప్రతిరూపం. హృదయంలో ఎరుక మనస్సుగా మారడం వృక్షం కావడమైతే, జీవన వ్యవహారాలు ఫలించడం, ఆపై మళ్ళీ ఆలోచనలను ఉపసంహరించుకుని మౌనంగా మారడం ఉనికిలోకి వెళ్లడమవుతుంది. నాద సాధనలు లేదా ఓంకార సాధనలు కూడా ఈ గ్రహింపును తెలుసుకోవడానికే ఉపయోగపడతాయి. అయితే పరమాత్మ లేదా ఉనికి యొక్క అందాన్ని కేవలం ఒకే సాధనా మార్గానికి పరిమితం చేయలేము, అనేకత్వంలో కూడా ఆ అనంతత్వాన్ని దర్శించవచ్చు. పసిపాప నవ్వు వెనుక ఉన్న

భావాన్ని, భావం వెనుక ఉన్న చైతన్యాన్ని చూడకుండా కేవలం బాహ్యమైన పెదాల కదలికలనే చూడటం బాహ్య మోహమవుతుంది. ఊహ కంటే నిజం, నిజం కంటే ఊహ తీయగా అనిపించే వైరుధ్యాన్ని దాటి, సత్యాన్ని ఉన్నది ఉన్నట్లు గ్రహించడమే అందం. పరమాచార్య స్వామి ద్వారా ఒక భక్తుడి జీవితంలో జరిగిన సంఘటన మనకు తెలిసేది ఏమంటే... తన సొంత చెల్లెలికి, రక్తసంబంధీకులకు లేదా ఆత్మీయులను నిరాదరణ చేసి సమాజంలో గొప్పలు చేయడం, ధనమదంతో జీవించడం ధర్మం అనిపించుకోదు అని. ప్రేమ అనేది మన శరీరంతో, మన ఇంట్లోని వాళ్లతో, పరివారంతో మొదలై సమస్త ప్రాణికోటికి విస్తరించాలి. అలా ప్రేమాస్పదుడైనవాడే ఈశ్వరునికి ప్రీతిపాత్రుడవుతాడు.

ఉపాధి (దేహం) లక్షణాలను పక్కన పెట్టి, మనస్సు చేసే ప్రతిధ్వనులను ఆపినప్పుడు మన సొంత ఉనికి లేదా ఆత్మచైతన్యం అనుభవంలోకి వస్తుంది. బాహ్య జీవనానికి ఆలోచనలను, ఉపాధిని వాడుకుంటూనే, అంతరంగంలో నిర్లిప్తంగా ఉన్నప్పుడు ఆ మౌనంలోని అనాహత నాదం వినబడుతుంది. మనస్సు మౌనమైనప్పుడు బయటి శబ్దాలు కేవలం బాహ్యానికే పరిమితమై, అంతరంగంలో నిశ్శబ్ద గానం వినబడుతుంది. మనం అద్దంలో మన ముఖాన్ని చూసుకున్న తర్వాత బయటకు వచ్చి అందరినీ ఎలా మనలాగే చూస్తామో, అలాగే అంతరంగంలో మన ఉనికిని దర్శించిన తర్వాత బయట ప్రపంచంలో చెట్టు, పుట్ట, జీవరాశు లన్నింటిలోనూ ఆ ఒక్క అనంత చైతన్యమే కనిపిస్తుంది. మనం ఏ పని చేసినా, ఏ దేవుణ్ణి ఆరాధించినా మనస్సు నిశ్చలంగా, పవిత్రంగా ఉంటేనే ఆ అందాన్ని అందుకోగలుగుతాము. పవిత్రత అనేది కేవలం ఆలోచనలలో మాత్రమే కాక మన ప్రవర్తనలో, సంభాషణలో ప్రతిబింబించాలి. బాహ్యంగా వ్యాపారాలు, ఉద్యోగాలు, సంసారం చేస్తూనే అంతరంగంలో ఉదాసీనత లేదా నిర్లిప్తత కలిగి ఉండటమే నిజమైన ఓంకార నాదం. శ్రీకృష్ణ పరమాత్మ లాగా బాహ్య క్రియలను చక్కగా నిర్వర్తిస్తూనే, అంతరంలో నిశ్శబ్ద మౌనాన్ని ఆస్వాదించే స్థితప్రజ్ఞతను సాధించడమే శివానంద భగవానులు మరియు జే. కృష్ణమూర్తి గారు అందించిన ఆత్మజ్ఞాన సందేశం.

# జన్మజన్మల కర్మలను నశింపజేసే ఓంకార సాధన

## (ప్రణవోపాసన -1)

### శివశ్రీ రమణ గురుదేవుల బోధ

సద్గురువులు ఉపదేశించిన ప్రణవోపాసన మరియు అనాహత ఓంకార శబ్ద ప్రాశస్త్యం గురించి విచారణ చేద్దాము. మన హృదయములోని అనాహత చక్రంలో స్వయంభువుగా, నిరంతరం ఉద్భవించే శబ్దమే అనాహత ఓంకారం. ఇది మనం పెదవులు కదిలించి చేసే జపము కాదు, ఆలోచనలతో చేసే నామము లేదా రూప ధ్యానము కాదు. మనస్సులో రూపము, నామము, ఆలోచన అనేవి లేనప్పుడు లభ్యమయ్యే సహజ శబ్దమే ఇది. సాధారణంగా మనకు ఏ ఆలోచన వచ్చినా దానికి నామము, రూపము ఉంటాయి. ఉదాహరణకు, మన నాన్నగారి గురించి గాని లేదా అమ్మాయి గురించి గాని ఆలోచించినప్పుడు, ముందుగా నామము లేదా రూపము గుర్తొస్తాయి. షాప్‌కు వెళ్ళి అగ్గిపెట్టె అని అడిగినప్పుడు, ఆ నామం చెప్పగానే ఆ వస్తువు అనే రూపాన్ని ఇస్తారు. ఆ వస్తువు చేతికి వచ్చాక నామంతో పనిలేదు. ఈ విధంగా జగత్తంతా రూపనామములతో నిండి ఉంది. భగవానుడు చెప్పినట్లు ధ్యానం లేదా జపం చేసేటప్పుడు రూపం గురించి ఆలోచిస్తే మనస్సు



విడిపోయి ఆలోచనగా మారిపోతుంది. రూపాన్ని మనం జ్ఞాపకం ద్వారా గుర్తుపట్టగలమే తప్ప రూపాన్ని జపించలేము. జపించేది కేవలం నామాన్ని మాత్రమే. నామం ద్వారా రూపాన్ని ఆరాధిస్తాము కాబట్టి నామ సాధన చాలా ప్రశస్తమైనది. నామం జపించేటప్పుడు దానికి అనుబంధంగా ఉండే ఫలితాన్ని లేదా ఉద్దేశాన్ని పక్కనబెట్టి, ఏకాగ్రంగా 'ఓం నమః శివాయ' అని నామాన్ని జపిస్తూ ఉంటే, కొంతసేపటికి ఆ నామం కూడా అదృశ్యమైపోయి అనాహత శబ్దంగా మారుతుంది. దీనికి సద్గురువులు నాద సాధన క్రమాన్ని పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరి అని వివరించారు. ఉదాహరణకు, ఒక వీణ తీగను మీటినప్పుడు టింగ్ టింగ్ అనే ధ్వని వస్తుంది, అదే ఒక కళాకారుడు వాయిస్తే శబ్దం ధ్వనిగా మారి మధురమైన సంగీతమవుతుంది. వీణలో శబ్దం అంతర్లీనంగా ఉండటం వల్లే అది ధ్వనిగా బయటకు వస్తోంది. అలాగే మన లోపల ఉన్న అనాహత శబ్దమే పంచాక్షరి గాని, హనుమత్ మంత్రంగాని, అమ్మవారి నామంగాని ధ్వని రూపంలో బయటకు వస్తోంది. నామ జపం చివరికి ఆ అక్షరాలను దాటి శబ్దంగా మారిపోవాలి. మనం ఒక నటుడి పేరు ఉచ్చరించినప్పుడు ఆ ధ్వని వెనుక రూపం గుర్తొచ్చినట్లు, ధ్వని శబ్దంగాను, శబ్దం రూపనామ ప్రపంచంగాను మారుతుంది. వీణ తీగను మీటితేనే ధ్వని వచ్చినట్లు, గంటను కొడితేనే శబ్దం వచ్చినట్లు, మనలోని జీవభావం, దేహాత్మ భావము, ఆలోచనే ఈ ప్రపంచాన్ని మీటుతున్నాయి. ఆ మీటడం ఆగిపోతే మూల శబ్దమే మిగులుతుంది. ఈ అనాహత ఓంకార శబ్ద సాధన వల్ల దేహం నాది కాదనే సత్యం అవగతమై, దేహాత్మ భావన మరియు జీవభావము తొలగిపోతాయి. అప్పుడు నాకు జబ్బులు లేవు, కష్టాలు లేవు, జననమరణాలు లేవనే పరమసత్యం బోధపడుతుంది. ఈ శబ్దాన్ని శుద్ధ మనస్సుతో వినవచ్చు. శుద్ధ మనస్సు అంటే రూపనామములు, ఆలోచనలు లేని ఎరుక స్థితి. అక్కడ శబ్దాన్ని వినే 'నేను' అనే కర్తృత్వ భావన ఉండదు. ప్రణవోపాసన వల్ల అనేక జన్మల కర్మవాసనలు, దుఃఖ ప్రారబ్ధానికి హేతువైన సమస్త పాపాలు నశించిపోతాయి. కష్టసుఖాలను దాటిపోయే స్థితి లభిస్తుంది. సాధనలో ఏకాగ్రత కుదిరినప్పుడు జపం చేసే కర్తృత్వము, నామం వినే ధ్యాస కూడా పల్చబడిపోతాయి. కలలో ఒక నదిలో ఈత కొట్టి, పక్కనే ఉన్న



దేవాలయాన్ని దర్శించిన వ్యక్తికి మెలకువ రాగానే ఆ కల ఎక్కడ పుట్టిందో అక్కడే లయమైనట్లు, ఏకాగ్రతలో ధ్వని పల్చబడి మూల శబ్దమైన అనాహత ఓంకారంలో కలిసిపోతుంది. యోగం అనేది భయాలను, సంసార తాపాలను తొలగించే ఒక శాస్త్రం. 120 ఏళ్ళ సుదీర్ఘ కాలం చేసే సాధన ఫలాన్ని క్షణకాలంలో ఈ ఓంకార స్మరణ అందిస్తుంది. సమస్త బ్రహ్మాండాలు, లోకాలు, జీవరాశులు, మనస్సు, ఆలోచనలు అన్నీ ఆ పరమాత్మ స్వరూపమే. తల్లి గర్భంలో దేహాన్ని తయారుచేసిన ఆ పరమాత్మ శక్తే బయటకు వచ్చాక ప్రపంచంగా, ఆలోచనగా రూపుదిద్దుకుంది. పరమాత్మే ఆలోచనగా ఉన్నప్పుడు, మళ్ళీ అదే ఆలోచనతో పరమాత్మను సాధించాలనుకోవడం వివేకం కాదు. ఈ సత్యాన్ని గ్రహించి నామజపం ద్వారా శబ్దంలో లయం కావడమే జ్ఞానం. ఓంకారం అకార, ఉకార, మకారముల కలయిక. అనాహత సాధనలో చూచేవాడు లేకుండా చూడటం, వినేవాడు లేకుండా వినడం సాధ్యమవుతుంది. ప్రారబ్ధ కర్మ వల్ల వచ్చే కష్టాలను కూడా జ్ఞానదృష్టితో 'ఇవి నావి కావు' అని అధిగమించవచ్చు. కనుక ప్రతిరోజూ ఉదయం ఒక గంట, రాత్రి ఒక గంట పూర్ణ విశ్వాసంతో గురువాక్యంపై నమ్మకంతో ఓంకార సాధన లేదా నామ జపం చేయడం వల్ల మనస్సు శబ్దంలో లయమై, అనాహత స్థితి సిద్ధించి పరమాత్మ తత్త్వంలో ఐక్యమవడం నిశ్చయం.

# శరణాగతి అంటే!

## (శ్రీ రమణ భగవాన్ బోధపై శివశ్రీ రమణ గురుదేవుల విచారణ!)

ప్రపంచంతో నీకున్న సంబంధంలో, నీకు ప్రపంచానికి ఉన్న ఆ అభావ సంబంధంలో జ్ఞానం ఉంటుంది. ఎరుక నేనైతేనే నాకు ప్రయోజనం, మళ్ళీ అక్కడ విభజన లేదు. ఇప్పుడు మిమ్మల్ని చూడగానే మీరు నాకు కనపడుతున్నారు, నన్ను చూడగానే మీకు నేను కనపడుతున్నాను, అంతే ఎరుక. అంతే తప్ప ఎరుక భిన్నంగా ఉండే ఒక పనిముట్టులాగా, కళ్ళలాగా, ఇంద్రియాలలాగా, మనసులాగా, దేహం లాగా ఆధారపడి లేదు అది దేని మీద ఆధారపడలేదు, అది స్వయంప్రకాశం. ప్రపంచం అయితే నాకు తెలిసింది అంటారు, నా విషయంలో అయితే నేను తెలుసుకుంటున్నాను అంటున్నాను. నేను తెలుసుకుంటున్నాను అనటంలో తెలియ బడేదే ఇతరం అంతా. ఆ తెలియటమే జ్ఞానం. తెలియటానికి ఏదైతే సాధనంగా ఉందో, సాధ్యంగా ఉందో అది జ్ఞానం. మెలుకువ రాగానే ఎరుక వల్ల అన్నీ తెలుస్తున్నాయి అని తెలియడం పేరు జ్ఞానం. ఎరుక దేనికీ తెలియక్కర్లేదు. ఎరుక నీ స్వరూపం. ఎరుక నేనైతేనే నాకు ప్రయోజనం, అక్కడ ఏ విభజనా లేదు.

పొద్దున్నే మెలుకువ రాగానే దేహం, ప్రపంచం, ఆలోచనలు, కర్మలు అన్నీ తెలుస్తున్నాయి. ఎరుక వచ్చాక ఇవన్నీ వస్తున్నాయి తప్ప, ఇవి వచ్చాక ఎరుక రావట్లేదు. ఎరుక ముందా, ఆలోచన ముందా అంటే ఎరుకే ముందు, ఆలోచనలు తర్వాత. ఏకాగ్రత అంటే ఏకమైంది సృష్టిలో ఒకటే ఆత్మవస్తువు ఎరుక. అగ్రము అంటే ముందు అని, ఆరంభము అని. ఎరుక వచ్చాక ఆలోచనలు వస్తున్నాయి కాబట్టి ఆలోచనలతో ఎరుకను తెలుసుకోవాల్సిన అవసరం లేదు. మీకు మీరు తెలిసాకే ఇతరులు కనపడతారు. కాబట్టి ఆలోచించవలసిన అవసరం లేదు, ఎరుకే నీ స్వరూపం, ఎరుక వచ్చాకే సమస్తం వస్తున్నాయి.

సద్గురు శివానంద భగవానులు, భగవాన్ రమణులు చెప్పిన మాటను ఒకసారి గుర్తుచేసుకుంటే, నా ధ్యానం అంతా గురువే చేస్తున్నారు కాబట్టి నేను ధ్యానం

చేయక్కర్లేదు. ధ్యానం బాధ్యత గురువుది. నా జీవనం, నా భార్య, నా పిల్లలు, నా సంసారం, నా ఇల్లు, నా సుఖదుఃఖాలు ప్రారబ్ద రూపంలో ఉన్న ఈశ్వరుడు చేస్తాడు. ఈ లోకంలో ఇహం, పరం అని రెండే ఉన్నాయి. ఇహమేమో ఈశ్వర నిర్వహణ, పరానికి సంబంధించిందేమో గురు నిర్వహణ. ఈశ్వరుడు, గురువు అనే ఇద్దరే ఉన్నారు. శరణాగతి అంటే నా ధ్యానాది సర్వ విషయాలు గురువుచే నిర్వహించబడుతున్నాయి, జీవన వ్యవహారమంతా ఈశ్వరుడు నిర్వహిస్తున్నాడు అని నమ్మడమే. కర్తృత్వమే అజ్ఞానం. నా ధ్యానం గురువు చేస్తున్నారు, నా జీవనం ఈశ్వరుడు చూసుకుంటున్నారు అని అనుకుంటే అదే జ్ఞానం. నా సమస్తము ఆయనదే, నా సుఖదుఃఖాలు ఈశ్వరుడి అధీనములు అని భావించడమే శరణాగతి.

రమణ భగవానుల వద్దకు ఒక భక్తుడు వచ్చి సత్యాన్ని తెలుసుకోవడంలో మత గ్రంథాలు, అనుభవాల ప్రయోజనం ఎంతవరకు అని అడిగాడు. సర్వోన్నత శక్తి లేదా ఆత్మ ఒకటి ఉన్నదని చెప్పేందుకే, దారి చూపేందుకే గ్రంథాలు ఉపకరిస్తాయి. ఆధ్యాత్మిక పరిణితిని పొందుతున్నప్పుడు ఆ స్థితులన్నీ దాటాక కడపటి గమ్యం మాత్రమే నిలిచి ఉంటుంది. గ్రంథాలు సోపానాలు, ప్రయాణానికే కానీ గమ్యానికి కాదు. అనుభవం అనేది గడిచిపోయింది, అది ప్రస్తుతానికి అప్రస్తుతం. గ్రంథాలు, సమాచారం తాత్కాలిక ప్రయోజనాన్ని మాత్రమే ఇస్తాయి, అవి ఫలం కానేరవు. గ్రంథాలు కేవలం చేతిలో ఉండే టార్చ్ లైట్ లాంటి సమాచారం మాత్రమే.

సర్వము తానైన, సర్వాంతర్యామి అయిన శక్తి ఒకటి ఉందని తెలిసాక ఇక నీ ఆసక్తి, అనాసక్తులతో పనిలేదు. నీ దేహ కార్యాలన్నీ ఈశ్వరుడు చేస్తున్నాడు, నీ జ్ఞాన, ధ్యాన కార్యాలు గురువు చేస్తున్నారు అని స్ఫురణ కలిగి ఉండటమే మౌనం. నేను ఏమీ చేయట్లేదని తెలుసుకోవడమే నిజమైన స్థితి. అంతా ఈశ్వర, గురు నిర్వహణ అని గ్రహించి ప్రశాంతంగా ఉండటమే సాధన. నా ధ్యానాన్ని గురువు చేస్తున్నారు, నా జీవనాన్ని ఈశ్వరుడు నడిపిస్తున్నాడు అనే నిరంతర ఎరుకతో జీవించడమే అమృతత్వము, ఏకాదశి వ్రతము, మోక్షము.

# విచారణ అంటే
# విభజన లేనిదాన్ని తెలుసుకోవడం

## శివశ్రీ రమణ గురుదేవుల బోధ

విచారణ అంటే కేవలం ప్రశ్నలు వేసుకోవడం కాదు. ఏది విచారిస్తోంది? ఏది విచారించడంలేదు? విచారణ చేస్తున్నది ఎవరు? విచారణకు లోబడుతున్నది ఏమిటి? – ఇవన్నీ స్పష్టంగా తెలుసుకోవడం నిజమైన విచారణ. మనకు సాధారణంగా ప్రపంచం మూడు విధాలుగా కనిపిస్తుంది. నేను, నాది, ఇతరులు; లోపల, బయట; భక్తి, ధ్యానం, జపం, యోగం, విచారణ. ఇలా చూస్తున్నంతకాలం విభజన ఉన్నట్టే అనిపిస్తుంది. కానీ విచారణ సవ్యంగా సాగితే, ఈ విభజనలన్నింటి ఆధారంగా ఉన్నది ఒక్కటే ఎరుక అని తెలుస్తుంది.

### ఎరుకను గుర్తించడం

మెలకువ వచ్చిన వెంటనే మనం పనిలో పడిపోతాం. కానీ ఒకసారి ఆగి, "మెలకువ వచ్చింది అని గుర్తించినది ఎవరు?" అని ప్రశ్నించామా? "ఇది మెలకువ" అని చెప్పేది మనసు."ఇది ఆలోచన" అని గుర్తించేది కూడా మనసే."నేను ఆలోచిస్తున్నాను" అని చెప్పేది కూడా మనసే.అయితే ఆ మనసును, దాని ఆలోచనలను గమనిస్తున్నది ఎవరు? ఇక్కడే అసలు విచారణ ప్రారంభమవుతుంది. ఏది విచారిస్తుందో అది తెలుసుకోవాలి. ఏది విచారించదో అది కూడా తెలుసుకోవాలి. విచారణ చేసేది మనసే; ఎరుక విచారణ చేయదు. ఎరుకకు తనను తాను తెలుసుకోవడానికి మరో ఆలోచన అవసరం లేదు. మనసు మాత్రమే "నేను తెలుసుకుంటున్నాను", "నేను విచారిస్తున్నాను" అని భావిస్తుంది. అందువల్ల విచారణ యొక్క అంతిమ ప్రయోజనం మరిన్ని ఆలోచనలు సంపాదించడం కాదు; విచారణ చేస్తున్న మనసు స్వరూపాన్ని తెలుసుకుని, చివరికి విచారణ కూడా ఆగిపోయే స్థితికి చేరడం.

## భక్తి, జపం, ధ్యానం, యోగం ... ఫలితం ఒక్కటే

మనిషి ఆధ్యాత్మిక సాధనలో ఎన్నో మార్గాలను అనుసరిస్తాడు. ఎవరో విగ్రహారాధన చేస్తారు. ఎవరో జపం చేస్తారు. ఎవరో ధ్యానం చేస్తారు. ఎవరో యోగసాధన చేస్తారు. మరికొందరు ఆత్మవిచారణ చేస్తారు. బయటికి ఇవన్నీ వేర్వేరు మార్గాలుగా కనిపిస్తాయి. కానీ విచారణతో చూస్తే, వీటి అంతరార్థం ఒక్కటేనని తెలుస్తుంది. సాధన ఏదైనా, దానిని అనుభవిస్తున్నది ఎవరు? జపం చేస్తున్నది ఎవరు? ధ్యానం చేస్తున్నది ఎవరు? పూజ చేస్తున్నది ఎవరు? యోగసాధన చేస్తున్నది ఎవరు? ఈ ప్రశ్నను నిజాయితీగా అనుసరిస్తే, ప్రతి మార్గమూ చివరికి ఒకే ఆధారమైన ఎరుక వైపు తీసుకువెళ్తుంది. అందుకే విచారణ సవ్యంగా ఉంటే, వివిధ సాధనాలు వేర్వేరు ఫలితాలను ఇవ్వవు. వాటి అంతిమ ఫలితం భేదం తొలగి, ఏకత్వం ప్రత్యక్షమవడం.

## విగ్రహారాధనలో కూడా అదే సత్యం

విగ్రహారాధనను చాలామంది కేవలం అభిషేకం చేయడం, బొట్టు పెట్టడం, పూలు సమర్పించడం, ధూపం వేయడం, నైవేద్యం పెట్టడం అని మాత్రమే భావిస్తారు. ఇవన్నీ భక్తితో చేయడం ఎంతో మంచిదే. కానీ అక్కడితో ఆగిపోకుండా, "నేను ఎవరిని ఆరాధిస్తున్నాను? ఆరాధిస్తున్నది ఎవరు? ఆరాధించబడుతున్నది ఏమిటి? ఈ ఆరాధన యొక్క అసలు ఫలం ఏమిటి?" అని ప్రశ్నించినప్పుడు అది విచారణతో కూడిన ఆరాధన అవుతుంది.అప్పుడు ఒక అద్భుతమైన మార్పు సంభవిస్తుంది. విగ్రహంలో ఉన్నదీ, నాలో ఉన్నదీ వేరు కాదని తెలుస్తుంది. ఇంతకాలం "నేను ఇక్కడ ఉన్నాను, దేవుడు అక్కడ ఉన్నాడు" అనే భావన ఉంటుంది. విచారణ లోతుగా సాగినప్పుడు ఆ భేదం క్రమంగా కరిగిపోతుంది. ఆరాధించేవాడు, ఆరాధించబడేవాడు, ఆరాధన ... ఈ మూడింటికీ ఆధారం ఒక్కటే ఎరుక అని తెలుస్తుంది. ఇదే విగ్రహారాధన యొక్క అంతరార్థాన్ని గ్రహించడం.

## జపం, ధ్యానంలో కూడా అదే ఎరుక

జపం చేసేటప్పుడు నామం ఉంటుంది. నామాన్ని పలికే మనసు ఉంటుంది.

ఆ నామాన్ని గమనించే ఎరుక ఉంటుంది. "జపం చేస్తున్నది ఎవరు?" అని విచారిస్తే, మళ్లీ అదే ప్రశ్న మనసును దాని మూలం వైపు తీసుకువెళ్తుంది. ధ్యానంలో కూడా అంతే. "ధ్యానం చేస్తున్నది ఎవరు?" "ధ్యానించబడుతున్నది ఏమిటి?" "ధ్యానాన్ని గమనిస్తున్నది ఎవరు?" అని పరిశీలిస్తే, లోపలైనా బయటైనా, అంతరంగమైనా బాహ్యమైనా, అన్నింటికీ ఆధారమైనది ఒక్కటే ఎరుక అని తెలుస్తుంది. అందుకే జపం చేస్తూనే జీవనాన్ని కొనసాగించవచ్చు. ధ్యానం చేస్తూనే కర్తవ్యాలను నిర్వహించవచ్చు. ఆధ్యాత్మిక సాధన అనేది జీవితానికి దూరంగా పారిపోవడం కాదు. సహజ సమాధి అంటే జీవితాన్ని వదిలేయడం కాదు యోగి సమాధిలో ఉన్నప్పుడు మాత్రమే సత్యాన్ని అనుభవిస్తాడని మనం అనుకుంటాం. కానీ నిజమైన పరిపక్వత ఏమిటంటే – సమాధి అనుభూతి జీవితానికి భిన్నమైనదిగా ఉండకపోవడం. సమాధిలో ఉన్నప్పుడూ అదే ఎరుక. జాగృతిలో ఉన్నప్పుడూ అదే ఎరుక. జపంలో ఉన్నప్పుడూ అదే ఎరుక. సంసారంలో ఉన్నప్పుడూ అదే ఎరుక. అప్పుడు జీవితం మరియు ఆధ్యాత్మికత అనే రెండు వేర్వేరు విషయాలు కావు. భార్య, పిల్లలు, ఇల్లు, ఉద్యోగం, వ్యాపారం, బాధ్యతలు – ఇవన్నీ చేస్తూనే అంత రంగంలో ఆ ఏకమైన ఎరుకను కోల్పోకుండా జీవించడం సాధ్యమే. ఇదే సహజ స్థితి వైపు ప్రయాణం. మహాజ్ఞానుల జీవితాలు మనకు చూపించే సంకేతం కూడా ఇదే. వారు లోకంలో ఉన్నప్పటికీ లోకానికి అతీతమైన ఏకత్వంలో జీవించారు. రమణ మహర్షి, సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానులు, రామకృష్ణ పరమహంస వంటి మహనీయుల సాధనా జీవితాలను పరిశీలించినప్పుడు, వివిధ మార్గాల ద్వారా సాగినా అంతిమంగా అనుభవించిన సత్యం ఒక్కటేనని తెలుస్తుంది.

## "మూడు"గా కనిపించేది "ఒకటి"

ఆరాధకుడు – ఆరాధ్యుడు – ఆరాధన; జపకుడు – జపం – జపించబడే నామం; ధ్యాత – ధ్యానం – ధ్యేయం... మొదట ఇవి మూడు వేర్వేరు అంశాలుగా కనిపిస్తాయి. కానీ విచారణ లోతుగా సాగినప్పుడు ఈ మూడు విభజనలు క్రమంగా తొలగిపోతాయి. మూడు ఉన్నట్టు కనిపించినా, వాటన్నింటికీ ఆధారం ఒక్కటేనని తెలుస్తుంది. మూడు మార్గాలు కనిపించినా –ఫలం ఒక్కటే. మూడు సాధనలు

కనిపించినా – ఆధారం ఒక్కటే. మూడు స్థితులు కనిపించినా – ఎరుక ఒక్కటే. చివరికి "మూడు" కూడా ఉండదు. "ఒకటి" అనే భావన కూడా అవసరం ఉండదు. ఎందుకంటే రెండవది లేనప్పుడు "ఒకటి" అని చెప్పడానికి కూడా అవసరం ఏముంది? అక్కడ మిగిలేది భేదరహితమైన ఎరుక మాత్రమే.

అసలు విచారణ ఎక్కడ మొదలవుతుంది? మన సాధనలో ఒక పెద్ద పొరపాటు ఏమిటంటే – ఫలితం కోసం సాధన చేయడం. "జపం చేస్తే ఈ ఫలం వస్తుంది." "పూజ చేస్తే ఈ ఫలం వస్తుంది." "ధ్యానం చేస్తే ఈ అనుభవం వస్తుంది." "విచారణ చేస్తే జ్ఞానం వస్తుంది." ఇలా ఫలితాల కోసం మాత్రమే సాధన చేస్తే, మనం సాధన యొక్క అసలు ఉద్దేశాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రతి సాధనలోనూ ఒకసారి ఆగి ప్రశ్నించాలి: ఆరాధన చేస్తున్నది ఎవరు? జపం చేస్తున్నది ఎవరు? ధ్యానం చేస్తున్నది ఎవరు? ఫలాన్ని కోరుతున్నది ఎవరు? ఫలాన్ని అనుభవించేది ఎవరు? ఈ ప్రశ్నే సాధనను విచారణగా మారుస్తుంది. విచారణ అంటే సాధనను నిరాకరించడం కాదు. విగ్రహారాధనను వదిలేయడం కాదు.

జపాన్ని ఆపేయడం కాదు. ధ్యానాన్ని తిరస్కరించడం కాదు. వాటన్నింటి అంతరార్థాన్ని తెలుసుకోవడం. విచారణ చివరికి మనకు ఒక గొప్ప సత్యాన్ని తెలియజేస్తుంది: విభజన నిజం కాదు. విభజనను చూస్తున్న మనసే దానిని సృష్టిస్తోంది. ఆరాధనలోనూ అదే ఎరుక. జపంలోనూ అదే ఎరుక. ధ్యానంలోనూ అదే ఎరుక. యోగంలోనూ అదే ఎరుక. విచారణలోనూ అదే ఎరుక. జీవితంలోనూ అదే ఎరుక. మార్గాలు వేర్వేరుగా కనిపిస్తాయి; సాధనలు వేర్వేరుగా కనిపిస్తాయి; పద్ధతులు వేర్వేరుగా కనిపిస్తాయి. కానీ విచారణ సవ్యంగా సాగితే, అన్నింటి వెనుక ఉన్న ఒకే ఆధారాన్ని తెలుసుకుంటాం. అప్పుడు సాధన చేసే "నేను", సాధన, సాధించవలసిన ఫలం – ఈ మూడింటి మధ్య ఉన్న భేదం కరిగిపోతుంది. విచారణ అంటే కొత్తదాన్ని పొందడం కాదు. విభజన లేదని తెలుసుకోవడం. ఎరుకకు రెండవది ఏదీ లేదని ప్రత్యక్షంగా గ్రహించడం. అదే విచారణ యొక్క పరమార్థం. అదే అన్ని సాధనల యొక్క అంతిమ ఫలం. అదే సహజమైన స్థితి.

# దైవభక్తి... దేశభక్తి... సనాతన ధర్మానికి రెండు కళ్లు

**(తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేట మాధవ నిలయం ప్రారంభోత్సవం సందర్భంగా శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల కరదీపిక సందేశం - 27.05.26 - రెండవ భాగం - గత సంచిక తరువాయి)**

మనం మనసుతో, కుటుంబంతో, సమాజంతో, ప్రకృతితో, దైవంతో ప్రవర్తించే మన శీలం మన మౌలికగుణంగా ఉండాలి. సనాతన ధర్మం యొక్క ఉద్దేశం మన హృద్దేశంలో ఉన్నప్పుడే అది ఈ పంచక్షేత్రాల్లో వర్తించి అది హృదయనర్తనంగా మారుతుంది. బంధుత్వం విషయంలో మనది రక్తసంబంధమైతే సమాజంతో ఉండే బాంధవ్యం విషయంలో మనది భక్తసంబంధం అని తెలుసుకోవాలి. సేవాగుణం, భావసారూప్యత కలిసిందే ఈ భక్తసంబంధం. అవయవంతో శరీరానికి, మనసుకు వచ్చే బాధ భౌతికసంబంధం అయితే ఎక్కడ ఎవరికి బాధకలిగినా అది ప్రకృతిలో ప్రతిబింబించడం దైవంతో ఉన్న అధిభౌతిక సంబంధమే అని తెలుసుకోవాలి. శరీరంతో ఉన్న సంబంధం తెలియడం చేత భౌతికబాధను గ్రహిస్తున్నాం, కానీ అధిభౌతికమైన సంబంధంకూడా మనదే అని తెలియకపోవడం చేత ఇతర క్షేత్రాల్లో మన సంబంధబాంధవ్యాలను విస్మరిస్తున్నాం. అధిభౌతికంలో పరమాత్మ సూక్ష్మంగానూ, సమాజం స్థూలంగానూ ఉంటుంది. అటు పరమాత్మను, ఇటు సమాజాన్ని వదిలిపెట్టిన మనసే లయంగా, విలయంగా, ప్రళయంగా మారుతుంది. దీనివల్ల పరమాత్మతో వచ్చే పూర్ణఫలమైన శాంతి, ఆనందం ఎప్పటికీ లభించవు. భౌతిక సంబంధానికైనా, అధిభౌతిక సంబంధానికైనా క్రమశిక్షణ అవసరం. ఆ క్రమశిక్షణలో భాగమైన కమ్యూనికేషన్, రిలేషన్ మృగ్యంగా మారటంవల్లనే నేడు మేధోమరణమే సంభవిస్తుంది. బ్రెయిన్‌డెడ్ సంభవిస్తే ఆ మెదడునుండి ఏ అవయవానికి సంకేతం అందదు. ఈ ప్రమాదాన్ని గుర్తించే భౌతిక సంబంధం కోసం శరీరవ్యాయామాన్ని, అధిభౌతిక సంబంధం కోసం స్వయంసేవకసంఘాన్ని రూపొందించారు.

కమ్యునికేషన్‌కి అవసరమైన కలయిక కోసం సంఘంలో సంఘటితత్వాన్ని ప్రతిపాదించారు. జీవితకాలం మనతోనే ఉండే దేహాన్ని, మనసును వదిలిపెట్టి అరగంటలో వాసనవచ్చే దుస్తులకు, వాటికి సంబంధించిన ఫ్యాషన్లకు, ఆకర్షణలకు విలువనివ్వడం ఎంత మూర్ఖత్వమో, జీవితంలో అత్యవసరమైన శాంతి, ఆనందాలను అందించే మన సంబంధబాంధవ్యాలను మర్చిపోయి స్వార్థానికి విలువనివ్వడం కూడా అంతే అవివేకం. మనసుకు పంచేంద్రియాలతో సంబంధం ఉన్నట్లే మన జీవితానికి ఈ పంచశీలాలతో సంబంధం ఉంది. అది గుర్తుచేయడానికే వేదాలు మొదలు పురాణ ఇతిహాసాలు ప్రయత్నిస్తాయి. దాన్ని నేటి సమాజానికి అవసరమైన రీతిలో అందించే ఆధునిక వేదమే నేడు ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా జరుగుతున్న సమాజ సంస్కరణ ఉద్యమం. ఏ సంస్కరణ అయినా దానితో భౌతిక సంబంధమున్న వ్యక్తుల కోసం మాత్రమే కాదు..సమాజంలో సనాతనధర్మ పునరుద్ధరణకోసం... అధిభౌతిక సంబంధం ఉన్న మనందరికోసం. ఇది అర్థంచేసుకుంటే అవతారపురుషుడైన శ్రీరాముడిలోని ధర్మానికి పందిరిగా నిలిచిన ఆంజనేయస్వామిలాగా మనంకూడా పరమాత్మ మౌలిక గుణమైన సనాతన ధర్మానికి పందిరిగా నిలుస్తాము.

వేరుకు నీరుపోస్తే చెట్టులోని ప్రతి కొమ్మ చిగురించినట్లుగా ఏది అర్థం చేసుకొని ఆచరిస్తే పంచశీల సంస్కారాలన్నీ సహజంగా అలవడతాయో అదే మన సనాతన ధర్మం. ఆధ్యాత్మికతలోని సనాతనధర్మం పరిఢవిల్లితే భౌతికం అధిభౌతికం రెండూ బాగుంటాయి. ఏకకాలంలో అంతరంగంలోని దైవంతో, బాహ్యంలోని దేశంతో అవినాభావ సంబంధం కలిగి ఉండమని చెప్పే మన సనాతన ధర్మ సారాంశం సదా మన హృదయంలో నిలుపుకోవడమే ఆధ్యాత్మికత. ధర్మం అంటే ధరించ బడింది... అంటే అది శాశ్వతంగా నిలిచి ఉంటుంది. ఎవరూ నేర్పకుండానే పసికందును రక్షించిన ఆవులో వ్యక్తమైన ఆ మౌలిక గుణం పరమాత్మ దివ్యత్వంగా సృష్టి అంతా ఉంది. తనకు గాయమై కూడా రాణాప్రతాపుడిని రక్షించిన తర్వాతే ప్రాణాలు విడిచిన చేతక్ అనే గుర్రంలో, తాను పీల్చుకోగా ఎక్కువైన నీటిని పక్క చెట్టుకి ఇచ్చే వృక్షాల్లో అదే దివ్యత్వం ఉంది. అదే అటుదైవంగా, ఇటు ధర్మంగా సనాతనంగా ఉంది. అందుకే అది సనాతనధర్మం అయింది. అది సత్యం నుండి

తన దాకా వ్యాపించి ఉన్న ధర్మం. అదే ప్రేమగా, సేవగా మనకు వ్యక్తం అవుతుంది. ఫలాపేక్ష లేకుండా చేసే ఆ సేవా సంగమమే సంఘం. సృష్టిలో దాహంతీర్చే నీటిలో ఉన్న ధర్మాన్ని బుద్ధి ఉన్న మనిషి చేయకపోతే ఎలా? బాహ్యంలో ధర్మంగా, అంతరంగంలో దివ్యత్వంగా ఉన్న ఆ సత్యాన్ని అనాదిగా విశేషమైన జ్ఞానం ఉన్న అనేక మంది మహాత్ములు గుర్తించి మనకు చెప్తున్నారు. దాన్ని గుర్తించే బుద్ధి ఉన్న మనిషి దాన్ని కాపాడుకోవాలి. గుర్తించి కాపాడుకునే గుణమే శీలత. ఎప్పుడైతే శీలత ఉంటుందో బాహ్యంలో ఉన్నదాన్ని గుర్తుపట్టి దాన్ని తాను ఆచరించే శీలత వచ్చిన రోజు అంతరంగంలో ఉన్న దివ్యత్వాన్ని గ్రహించే శక్తి వస్తుంది. సృష్టిలో ఉన్న ధర్మాన్ని, దివ్యత్వాన్ని గుర్తించిన దేశం భారతదేశం. మంచినీళ్లలో దాహం తీర్చే మౌలికగుణంతోపాటు దివ్యత్వం కూడా ఉందని గ్రహించే శక్తి ప్రేమలో, సేవలో ఉంది. అదే మహాత్ములు బోధించిన శీలత. ధర్మాన్ని గుర్తించే శీలత లేకపోతే దివ్యత్వాన్ని గుర్తించలేము. దైవం, ధర్మం, దేశంలో ఉన్న ఆ దివ్యత్వమే త్రివేణీ సంగమం. అది గుర్తించి వినియోగంలోకి తెచ్చుకోవడమే యోగం అవుతుంది. అదే భారతదేశం మనకు నేర్పే సంయోగం. ఇతర దేశాల్లో కేవలం ప్రకృతిని ఉపయోగించుకోవడమే ఉంటుంది. ధర్మాన్ని గుర్తించి వినియోగించుకోవడం, మన భారతీయతలోనే ఉంది. ఎప్పుడైతే బుద్ధితో ధర్మం అనే మౌలికలక్షణాన్ని గుర్తించే గుణం వస్తుందో అందులోని దివ్యత్వాన్ని గ్రహించే శక్తివస్తుంది. కళ్లుమూసుకున్న వ్యక్తి తన పక్కనే ఉన్న మంట యొక్క వేడిని గుర్తించి ఆతర్వాత కళ్లు తెరిచి దాని వెలుగును గ్రహిస్తాడు. స్థూలంగా కనిపించే ధర్మాన్ని గుర్తిస్తే సూక్ష్మంగా ఉన్న కనిపించని దైవాన్ని గ్రహించే శక్తి వస్తుందని తెలుసుకున్న మహాత్ములు మనకు ఆ విషయాన్ని చెప్పి వాళ్లు వెళ్లి పోతారు. ఆయుర్దాయం అంటే ఒక జీవితకాలపు ఆయుఃప్రమాణం కాదు. స్వరూపజ్ఞానం కలిగేవరకూ అనేక జన్మలు, జీవి ప్రయాణించే కాలమే ఆయుర్దాయం. స్వరూపజ్ఞానంతో జీవిప్రయాణం సంపూర్ణం. దేశంలో ఉన్న ధర్మాన్ని గుర్తిస్తే... నీలో ఉన్న దైవాన్ని గ్రహిస్తావు అని చెప్పిన ఆ సనాతన జ్ఞానం మనం సృష్టి ఉన్నంతకాలం వినియోగించుకోవచ్చు. ధర్మో రక్షతి రక్షితః అని అందుకే అన్నారు. మహాత్ములు దైవాన్ని దర్శించి దానికి బాహ్యరూపమైన ధర్మాన్ని చెప్పారు. దేశభక్తులు బయట ధర్మాన్ని గుర్తించి ఆచరించండి అది దైవ

దర్శనంగా మారుతుంది అని చెప్పారు. ఇద్దరు చెప్పిందీ ప్రమాణమే. దైవం, దేశం, ధర్మంలో దేన్ని ఆశ్రయించి ఆచరించినా మిగిలిన రెండూ అనుభవంలోకి వస్తాయి. ఒక చీమ బెల్లం చూస్తే వంద చీమలను పిలుస్తుంది. అది దానిలో ఉన్న ధర్మం. అదే మనిషి చూస్తే ఆ చీమలను దులిపి తాను తినేసే అధర్మానికి పాల్పడతాడు. బుద్ధి ఉన్న మనిషి ధర్మాన్ని మరింత విశేషంగా ఆచరించాలి గానీ విస్మరించకూడదు. శీలం ఉన్న మనసు మాత్రమే బాహ్యంలో ఉన్న ధర్మాన్ని గుర్తించి అంతరంగంలో ఉన్న దైవాన్ని గ్రహిస్తుంది. అదే మన జీవిత పరమార్థం. అది అందించడానికి వచ్చిన మహాత్ములు ఒక శంకరాచార్యులలాగా, వివేకానందుడిలాగా, శ్రీ శివానంద భగవానులు వారిలా, శ్రీహెడ్గేవార్‌జీలా దేహం విడిచి వెళ్లిపోయినా శాస్త్రవేత్తలు కనిపెట్టిన సైన్సులాగా వారు చెప్పిన సత్యం మనకు ఎప్పుడూ వినియోగానికి అందుబాటులోనే ఉంటుంది. భౌతికమైన గుణాలతో పాటు మనలో శీలం కూడా ధర్మంలాగా ధరించబడే ఉంది. ఆ రెంటినీ చెప్పిందే మన భారతీయ సనాతన ధర్మం. నీటిలో దాహం తీర్చేగుణం ఉన్నట్లే మనలో దాహం తీరే గుణంకూడా ఉంది. రెండుచోట్ల ఉన్నదే నీటిధర్మం. ఎక్కడ లోపించినా దాని వినియోగం ఫలవంతం కాదు. చూడటం ప్రయోగం, అనుభవం పొందటం ప్రయోజనం. బయట గుణాన్ని గుర్తించే బుద్ధిని, అంతరంగంలో ఉన్న సత్యాన్ని గ్రహించే శక్తిని శీలత ఇస్తుంది. శీలతే మన స్వభావం కావాలి. అది పరమాత్మ లక్షణం. దాన్ని కాపాడుకోవాలి. దైవం సూక్ష్మం అయితే ధర్మం స్థూలం. గుణం ఉపయోగం అయితే మన శీలమే యోగం. శీలం అంటే స్వరూపస్వభావం. పరమాత్మగా ఉన్న మన స్వరూప స్వభావం ఏమిటంటే ప్రేమ, సేవ, దీన్నే మనం అనుగ్రహం అంటున్నాం. పరమాత్మ స్వరూపస్వభావం మనలోనూ, సృష్టి అంతటా ఉంది. అనంతంగా ఉన్న ఆ పరమాత్మ స్వరూపస్వభావం తెలియడమే శీలం. అదే యోగం. పరమాత్మను గుణంతో గుర్తుపడతాం. శీలంతో గ్రహిస్తాం. దర్శిస్తాం. పశు పక్ష్యాదులలో, వృక్షాల్లో వ్యక్తమయ్యే ఆ పరమాత్మ ప్రేమ స్వభావం తనలో కూడా చూసినప్పుడు అది యోగం అవుతుంది. అంతటా ఉందని గుర్తించే బుద్ధి భగవంతుడు మనిషికే ఇచ్చాడు. అందుకే శీలం నీలోని భగవంతుడిని చూసుకునే

యోగం అయింది. గుణంగా దేశంలో ఉన్న పరమాత్మను బుద్ధితో గుర్తించాలి. నీలో ఉన్న ఆ పరమాత్మ దివ్యత్వాన్ని శీలంతో తెలుసుకోవాలి. గుణం భౌతికం... శీలం అధిభౌతికం... ఏకకాలంలో దైవాన్ని తనలోనూ, సృష్టిలోనూ చూడగలిగిన ఆ ధర్మశీలాలే మన సనాతన ధర్మం. సత్యం తనలోనూ ఉందని, 'స'త్యానికి 'నా' 'తన' బేధం లేదని చెప్పేదే సనాతన ధర్మం. అందుకే ఇతర అన్ని మతాలు దైవం విడిగా ఉన్నాడని చెప్తాయి. సృష్టి అంతటా ఉన్న దైవం నీలో ఉందని చెప్పేదే మన సనాతన ధర్మం. పరమాత్మ స్వరూప స్వభావాన్ని గుణంగా బయట చూడటానికి ధర్మదృష్టి, దివ్యత్వంగా నీలో చూడటానికి శీలం కావాలి. అది చూసే గుణం లేకపోతే దేశం, దైవం పరిగణలోకి రాని పశుత్వంతో జీవిస్తాము. మనిషి తన స్వభావంలోని దైవాన్ని స్వరూపజ్ఞానంగా గ్రహించి ఉన్నతం కావాలి కానీ పశుత్వంతో పతనం కాకూడదు. పరమాత్మ స్వభావం సృష్టిగా మారింది. అది నీ శీలంతో నీలోనే దర్శించినప్పుడు జన్మసంపూర్ణమౌతుంది. అనాదిగా ఉన్న ఈ సత్యాన్ని చెప్పేదే సనాతన ధర్మం. మనిషి స్వభావం బాగుంటే తనలోని పరమాత్మ స్వరూపస్వభావాన్ని తెలుసుకోవచ్చని చెప్పే ఈ భారతీయత కేవలం ప్రపంచపటంలో హద్దులతో కూడిన భాగంగా కాక సంస్కృతి, సంప్రదాయాల రూపంలో ఎల్లలు లేని విశ్వగురువుగా నిలుస్తుంది. ఇది గుర్తుకు రావడానికే భారతమాత రూపాన్ని, అది గుర్తించిన మహాత్ముల ప్రతిరూపాన్ని మనం చిత్రాలుగా పెట్టుకొని ఆరాధిస్తాము.

కళ్లుమూస్తే దైవాన్ని స్మరించు... కళ్లు తెరిస్తే దేశాన్ని (సమాజాన్ని) సేవించు... అనే నవీన ఆధ్యాత్మిక నినాదాన్ని అందించిన సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల వారు దైవభక్తిలో ఉన్న దేశసేవను, దేశభక్తిలో ఉన్న దైవసేవను సెలవిచ్చారు. వారు అనుగ్రహించిన రుద్రభాష్య ప్రసంగాల్లో ప్రత్యక్ష, అనుమాన, ఆప్తవాక్య ప్రమాణాలతో కూడిన పరీక్షలకు నిలచే సత్యాన్ని ఆచరించడమే ఆర్షధర్మం, ఆర్యధర్మం, భారతీయత అని స్పష్టం చేశారు. మన తాత, ముత్తాతలు పరీక్షించి ప్రమాణంగా నిరూపించి చెప్పిన సంప్రదాయాన్ని అనుసరించడమే మన కర్తవ్యంగా బోధించారు. వారు పరీక్షించి నిరూపించిన సత్యాన్ని మనం పునఃపరీక్ష చేయ

నక్కర్లేదు. పరికించి చూస్తే, పరిశీలిస్తే ఆ సత్యాన్ని గ్రహించవచ్చు. దేశభక్తి, దైవభక్తి కేవలం మనుషులకు మాత్రమే కాదు. పశుపక్ష్యాది సమస్త జీవరాసుల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్నింటిలోనూ మౌలిక గుణంగా ఉన్న దైవీగుణాన్ని గుర్తుపట్టిన దేశం భారతదేశమే. శ్రీకాళహస్తి చరిత్ర చూస్తే సాలీడు, పాము, ఏనుగు వంటి జీవరాశితో ఏర్పడ్డ క్షేత్రమది. అనేక క్షేత్రాలతోపాటు శ్రీరమణభగవాన్ వంటి జ్ఞానుల జీవిత చరిత్రల్లోనూ జీవరాశితో పెనవేసుకున్న అనుబంధం, ఆ ప్రాణులు వ్యక్తం చేసిన భక్తి కనిపిస్తుంది. మనదేశంలోని అనేక ప్రాంతాల్లో భక్తులుగా మెలిగిన జీవరాశులకు కూడా గుడికట్టి పూజిస్తున్నాం. ఆ జీవరాశిలో ఉన్న ఆ మౌలికగుణం దైవభక్తి అయితే ప్రేమగా ప్రతిబింబించే ఆ దైవీగుణం వ్యక్తం కావడం దేశభక్తి. ఒకచెట్టు పక్కచెట్టుకు నీరిచ్చినా, ఒక ప్రాణి పక్కప్రాణికి సాయంచేసినా, కాపాడినా అదంతా దేశభక్తే. దేశం అంటే కేవలం ప్రాంతం కాదు, సంస్కృతి సంప్రదాయాల మేళవింపు. మనం దైవభక్తితో చేసే తీర్థయాత్రల్లో దేవాలయాలు, దేవతామూర్తులతో పాటు అక్కడి నదులు, కొండలు, ప్రజల సంస్కృతి సంప్రదాయాలను తెలుసు కోవడం దేశభక్తిలో భాగమే. ఆస్ట్రేలియా నుండి భారతదేశానికి వేలకిలోమీటర్లు ప్రయాణించి సంతానోత్పత్తికి అనువైన వాతావరణం కోసం భారతదేశానికి వచ్చే పక్షులు తిరిగి తమ పిల్లల్ని తీసుకొని స్వదేశానికి వెళ్లాలన్న వాటి ఇంగిత జ్ఞానంలోకూడా దేశభక్తే ఉంది. ఒక నాణానికి బొమ్మాబొరుసులాగా సృష్టి అంతా ఉన్న మౌలికగుణంగా ఉన్న దైవభక్తిని దేశభక్తిని గుర్తించిన దేశం మన భారతదేశం. భక్తి, ప్రేమ, శీలం, పవిత్రత, ధర్మం అన్నీ ఒకే దివ్యత్వం యొక్క పర్యాయపదాలు. మనందరం దర్శిస్తూ కూడా గుర్తుపట్టని ఆ సత్యాన్ని దైవభక్తితో గుర్తించమని చెప్పే మహాత్ములతోపాటు దేశసేవ ద్వారా తెలుసుకునేమార్గం చెప్పే మహనీయులూ ఉన్నారు. మన ఈధర్మభూమిలో దైవభక్తిలో దేశభక్తి, దేశభక్తిలో దైవభక్తి పూర్ణంగా ఇమిడి ఉంటుంది. ఇది అనాదిగా వస్తుండబట్టే పరమాత్మ దైవభక్తులుగానూ, దేశభక్తులుగానూ అవతరిస్తూ వస్తున్నారు. దైవభక్తిలో శీలంద్వారా సేవాగుణాన్ని, దేశభక్తిలో సేవద్వారా శీలాన్ని పెంచుతారు. అవి రెండూ పరమాత్మలక్షణాలే. త్రికరణశుద్ధిగా దేన్ని అనుసరించినా జన్మధన్యమై పురుషార్థసాధకమౌతుంది.

# Ask Him for an Obstacle : Thoughts for Ganesh Chaturthi

## *A God for Everyone*

**- Sri Gentela Anand Shankar**

Ask any child to draw a god, and there is a good chance they will draw Ganesha. The round belly. The big ears. A little mouse standing patiently to one side. No other god looks quite so easy to love, or quite so easy to draw.

He is also, amazingly, one of the most serious gods there is. Before any puja begins, whatever the occasion, whoever the main god being worshipped, Ganesha is worshipped first. This is not a small custom. It is followed everywhere, every time, without exception. The Atharva Veda itself carries a hymn to him, the Ganapati Atharvashirsha, which calls him the Adhipati, the ruling lord, of the Mooladhara, the root from which all our energy rises. Even the most advanced and secret forms of worship in the tantric tradition begin with him. Lakshmi Ganapati, where Ganesha is worshipped together with the goddess of wealth, is considered one of the most powerful sadhanas a person can undertake. Very few gods stretch this far. From a child's simple prayer before an exam, all the way to a hymn in the Vedas naming him the root of everything, somehow, Ganesha fits both ends.

But on Ganesh Chaturthi itself, before any of that grandness, there is a much smaller beginning. In most Telugu homes, no puja can start without a tiny Ganesha made of turmeric. Not the big painted idol that goes up on a stage weeks in advance. A lump of turmeric paste, pressed into shape by hand, small enough to sit in your palm. This form even has its own name, Haridra Ganapati. Without it, the rest of the puja does not properly begin. It sounds almost too humble to matter, a smear of turmeric

next to a magnificent clay idol dressed in silk. But tradition insists on it. The biggest festival of the year depends, first, on the smallest and plainest form of the god.

There is a reason for that, and it goes back to how Ganesha himself came to be. Goddess Parvati made him from the turmeric paste she used to clean her own skin, and breathed life into him. He was her creation before he was anyone's god. And yet, being divine did not spare him from hardship. Soon after he was made, in a case of mistaken identity, his father, Lord Shiva, struck off his head. It took the head of an elephant, the first creature they could find sleeping with its head turned north, to bring him back. Even a god born from his own mother's hands, even a being this powerful, still had to go through loss before he could be made whole again. No one, it turns out, is above karma. Even a god must go through what he is meant to go through.

### When the Pooja changed

This is also why Ganesha has always belonged so naturally to children. He is playful, a little mischievous, endlessly forgiving, much like Hanuman in that way. Few gods are this easy to love without effort. Which is probably why, over time, so much fun grew up around him: the music, the bright pandals, the long processions to the water for visarjan.

None of that fun is the problem. But somewhere along the way, the celebration began to grow louder than the puja underneath it. Families spend far more time choosing decorations and planning the procession than sitting with the turmeric idol that started the whole festival in the first place. The noise has become the main event, and the prayer, the actual reason for the noise, has quietly moved to the side. We enjoy the entertainment, and we forget to ask what we came here to celebrate.

## Guruji and Nannagaru's Words

Guruji used to point out something about Ganesha that most people miss. We call him the remover of obstacles, and pray to

him for exactly that, to clear our path. But Guruji would also ask us to pray for the opposite. Ask Ganesha to place an obstacle, he would say, in the path of your own wrongdoing. Let him block the very thing in you that wants to go astray.

That one shift changes what an obstacle really means. It stops being something that happens to us. It becomes something we can ask for, on purpose, and point at ourselves.

Guruji connected this to courage, though not the kind most people mean by the word. Courage, he said, is not picking a fight, raising your voice, or standing your ground in an argument. Real courage is what carries you through your own sadhana. If something is quietly pulling you away from it, even something as small as an attachment to one particular food, real courage is being able to let it go.

Nannagaru added an edge to this that is harder to sit with. Courage without dharma, he said, is not courage at all. It takes no real courage to overlook someone doing wrong, even, and maybe especially, when that someone is your own son or daughter. Most people stay quiet in these moments, afraid of the distance it might open up in the relationship. Nannagaru called this exactly what it is: a lack of courage, dressed up as love.

Put together, this is what Guruji and Nannagaru were really asking for. Not the courage to fight anyone, but the courage to pray, honestly, for the obstacles that keep us honest.

After all this, there is a question worth sitting with. Are we courageous enough to pray to God to remove whatever stands in the way of our sadhana, even if it costs us money, or costs us family? Are we truly that courageous? If we are not, it is worth asking ourselves why not. And are we courageous enough to ask Ganesha for the opposite too, to place an obstacle in front of anything, anything at all, that pulls us away from our sadhana? This is not a question with an easy answer. It is one we will have to think about deeply, and then act on.

# మధుర స్మృతులు

## శివశ్రీ రమణ గురుదంపతులకు శ్రీకృష్ణాష్టమి పురస్కారం

దిఁ. 24.09.2016 హైదరాబాదులోని తివోలీ గార్డెన్స్‌లో సద్గురు శ్రీశివానంద మూర్తి భగవానుల వారి సనాతన చారిటబుల్ ట్రస్ట్ వారి శ్రీ కృష్ణాష్టమి పురస్కారం అందుకున్న శివశ్రీ గెంటేల వెంకటరమణ, శ్రీమతి వసంతలక్ష్మి గురు దంపతులు. శ్రీ పీ.వీ.ఆర్.కే. ప్రసాద్ గారు, ఐ.ఏ.ఎస్. వారి చేతుల మీదుగా పురస్కారాన్ని అందించిన శ్రీ కందుకూరి బసవరాజు, శ్రీమతి రాజేశ్వరి దంపతులు.




